మానేరు **జనత**®

తెలుగు దినపత్రిక | ఇది జనం గొంతుక

08.03.2025 శనివారం Saturday | సంపుటి (Volume): 09 సంచిక (Issue) : 324 | పేజీలు : 8 Pages : 8 | Published from : Karimnagar


## ఫైనల్ మ్యాచ్ కోసం ఎదురుచూపు




సమస్య ఏదైనా
జనం కోసం జనతా..
ఇదే మా ఆహ్వానం
ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధి మీడియా
ప్రజా సమస్యలను వెలికితీసి..
వాటి పరిష్కారానికి పునాది వేసేది మీడియా
మీ సమస్య ఏదైనా మీ తరుపున నిలబడి
అటు అధికారులను గానీ,ఇటు రాజకీయ నాయకులను గానీ
నిలదీస్తూ, నిజాన్ని నిగ్గు తేలుస్తుంది జనతా..
రండి..మీ కలాన్ని కదపండి..
మీ గళాన్ని వినిపించండి.
అందరం కలిసికట్టుగా..
"జనతా"తో కలిసి ప్రజా సమస్యలపై పోరాడుదాం..!!
మొక్కవోని దీక్షతో పని చేద్దాం.. తగ్గేదేలే..!
జనం కోసం "జనతా"..

ఔత్సాహికులు..
సంప్రదించాల్సిన మొబైల్ నంబర్.. 7989867251
- ఎడిటర్


# దక్షిణాది ప్రాతినిధ్యం తగ్గించే కుట్రలు

### డీ లిమిటేషన్‌తో సీట్ల తగ్గింపునకు ఎత్తులు

దక్షిణ భారతంలో బిజెపికి 29 ఎంపి సీట్లే

ఎక్కడా అధికారంలో లేకపోవడంతో కక్షతీర్చుకునే ప్రయత్నం

ఇండియా టుడే కాన్‌క్లేవ్‌లో సిఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

దక్షిణాది రాష్టాప్రై ప్రతీకారం తీర్చుకోవడానికే కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ నియోజకవర్గాల పునర్విభజన చేపడుతోందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. ఎక్కడా అధికారంలో లేమని, రామని తెలుసుకునే ఇలా కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. జనాభా ప్రాతిపదిక పేరుతో అన్యాయం చేసేందుక మోడీ ఎత్తులు వేస్తున్నారని ఆరోపించారు. ఈ మేరకు డీలిమిటేషన్ అంశంపై రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ అంశంపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.



**న్యూఢిల్లీ జనతా న్యూస్:** డీలిమిటేషన్‌పై తమిళనాడు నుంచి తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తమవుతున్న వేళ 'ఇండియా టుడే' నిర్వహించిన కాన్‌క్లేవ్‌లో రేవంత్ రెడ్డి శుక్రవారం మాట్లాడారు. 'దక్షిణాదిలో భాజపాకు తగిన ప్రాతినిధ్యం లేదు. మూడోసారి కేంద్రంలో అధికారంలోకి వచ్చినప్పటికీ.. ఆ పార్టీ సాధించిన 240లో దక్షిణాదిలో గెలిచింది కేవలం 29 స్థానాలే. దక్షిణాదిలోని ఏ ఒక్క రాష్ట్రంలో కూడా ఆ పార్టీ అధికారంలో లేదు. ఏపీలో జూనియర్ భాగస్వామిగా ఉంది. అందుకే ప్రతీకారం తీర్చుకోవాలని

మిగతా 2 లో



## నియోజకవర్గాలు ఒక్కటి కూడా తగ్గవు

### మోడీ నాయకత్వంలో త్వరలో జనగణన


వచ్చే పార్లమెంట్ నాటికి మహిళా రిజర్వేషన్లు

మహిళా దినోత్సవ శుభాకంక్షలు తెలిపిన కిషన్ రెడ్డి



03


త్వరలోనే మోదీ నేతృత్వంలో జన గణన జరగబోతుందని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి తెలిపారు. అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాల పునర్విభజన జరగబోతుం దన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల నాటికి మహిళల రిజర్వేషన్లు అమలు అవుతాయని పేర్కొన్నారు.



02

## 10న గ్రూప్-1 ఫలితాలు వెల్లడి

ప్రకటించిన తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్



02

## ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో ట్విస్ట్

అమెరికా నుంచి వేరే దేశానికి వెళ్లిన ప్రభాకర్‌రావు, శ్రవణ్‌కుమార్

## ఎమ్మెల్సీ సీటు కోసం కాంగ్రెస్‌లో ఆశావహుల ఆశలు

### 5 ఎమ్మెల్సీ స్థానాలకు 20వ తేదీన పోలింగ్

కాంగ్రెస్‌కు నాలుగు ఎమ్మెల్సీలు దక్కే అవకాశం

సామా రామ్మోహన్ రెడ్డికి ఇచ్చే అవకాశం

ప్రస్తుతం రాష్ట్రంలో ఎమ్మెల్యే కోటాలో 5 ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీగా ఉన్నాయి. మార్చి 29వ తేదీ నాటికి శాసన మండలిలో ఐదు స్థానాలు ఖాళీ కాబోతున్నాయి. ఈ స్థానాలు భర్తీ చేసేందుకు ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది. మార్చి 20వ తేదీన పోలింగ్ జరుగనుంది. దీంతో ప్రధాన పార్టీల్లోని ఆశావహులు ఎమ్మెల్సీ సీటు దక్కించుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు.



03

## బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకులపై కేసీఆర్ సమీక్ష

ఏప్రిల్ 27న జరిగే వేడుకలపై ప్రత్యేక సమావేశం

పార్టీ ముఖ్యనేతలకు దిశానిర్దేశం



బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ రజతోత్సవ వేడుకలపై పార్టీ అధినేత కేసీఆర్ అధ్యక్షతన సన్నాహక సమావేశం జరిగింది. ఏప్రిల్ 27న జరగబోయే బహిరంగ సభపై పార్టీ నేతలతో కేసీఆర్ సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆవిర్భావ రజతోత్సవ వేడుకలపై పార్టీ నేతలకు కేసీఆర్ దిశానిర్దేశం చేశారు.

**హైదరాబాద్,జనతా న్యూస్:** బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ రజతోత్సవ వేడుకలపై పార్టీ అధినేత కేసీఆర్ అధ్యక్షతన సన్నాహక సమావేశం జరిగింది. ఏప్రిల్ 27న జరగబోయే బహిరంగ సభపై పార్టీ నేతలతో కేసీఆర్ సుధీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆవిర్భావ రజతోత్సవ వేడుకలపై పార్టీ నేతలకు కేసీఆర్ దిశానిర్దేశం చేశారు. ఎర్రవల్లిలోని కేసీఆర్ నివాసంలో జరిగిన

మిగతా 2 లో

## కళ్లెదుట జలదోపిడీ జరుగుతున్నా స్పందించరా..?

### ఇంత మొద్దునిద్ర సీఎంను నేనెప్పుడూ చూడలేదు : హరీశ్‌రావు



03

కృష్ణా జలాలను ఏపీ ప్రభుత్వం తీసుకెళ్తున్నా సీఎం రేవంత్‌రెడ్డి కళ్లుండి చూడలేకపోతున్నారని, ఇలాంటి మొద్దునిద్ర సీఎంను నేనెప్పుడూ చూడలేదని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. బనకచర్ల ద్వారా 200 టీఎంసీల కృష్ణా నీళ్ల తరలింపు కోసం ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు కుట్ర చేస్తుంటే రేవంత్ రెడ్డి ఎందుకు మౌనం వహిస్తున్నారని హరీశ్‌రావు ప్రశ్నించారు.

## అర్హులకు రేషన్ కార్డులు ఇస్తాం

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



03

## ఆస్తిపన్ను చెల్లింపులో వడ్డీరాయితీ

మరోమారు ఓటిఎస్ ప్రకటించిన ప్రభుత్వం

02

## ప్రభుత్వం ఆద్వర్యంలో నేడు అఖిలపక్ష భేటీ

ప్రజాభవన్ వేదికగా భట్టి అధ్యక్షతన సమావేశం

ముఖ్య అతిథిగా హాజరు కానున్న సిఎం రేవంత్

కిషన్ రెడ్డి, బండి తదితరులను ఆహ్వానించిన భట్టి



**హైదరాబాద్,జనతా న్యూస్:** పార్లమెంట్ మలివిడత సమావేశ్యాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ క్రమంలో రాష్ట్రంలో పెండింగ్ సమస్యలపై గళమెత్తేందుకు ఎంపిలు ఏకతాటిపై నడవాలని ప్రభుత్వం కోరుకుంటోంది. ఈక్రమంలో ప్రజాభవన్‌లో శనివారం అఖిలపక్ష ఎంపీల సమావేశం

మిగతా 2 లో

## బీసీలపై కవిత మాటలు దయ్యాలు వేదాలు వల్లించినట్లుంది

బీసీలపై చిత్తశుద్ధి ఉంటే బీఆర్ఎస్ పార్టీ ప్రెసిడెంట్ పదవి బీసీలకు ఇవ్వాలి

ఈటలను వేధించి ఎందుకు బటయకు పంపారు : ఎంపీ రఘునందన్‌రావు



03

## భార్య,అత్త వేధింపులు.. టెకీ ఆత్మహత్య

ఆత్మహత్యకు ముందు కంపెనీకి సూసైడ్ నోట్



02

# దక్షిణాది ప్రాతినిధ్యం తగ్గించే కుట్రలు

మొదటి పేజీ తరువాయి

భాజపా భావిస్తోంది. ఉత్తరాది రాష్ట్రాలకు మేలు చేకూర్చేలా డీలిమిటేషన్‌కు సిద్ధమవుతోందని రేవంత్ రెడ్డి అన్నారు.కేంద్రం ఆదేశాల మేరకే దక్షణాది రాష్ట్రాలు కుటుంబ నియంత్రణను సమగ్రంగా అమలు చేశామని రేవంత్ రెడ్డి అన్నారు. మరో 30ఏళ్లు డీలిమిటేషన్ ప్రక్రియను వాయిదా వేయాలని, అప్పుడు దక్షిణాది రాష్ట్రాల్లో జనాభా ఏవిధంగా పెరుగుతుందో చూడాలన్నారు. జనాభా ప్రాతిపదికన కాకుండా ప్రో రేటా విధానంలో సీట్ల పెంపు చేపడితే యూపీలో ప్రస్తుతం ఉన్న 80 సీట్లు 120కి పెరుగతాయన్నారు. తమిళనాడులో 39 నుంచి 60కి మాత్రమే చేరుతాయని అభిప్రాయపడ్డారు. కేవలం దక్షిణాదిలోనే కాదని ఉత్తరాదిలోని పంజాబ్ వంటి రాష్ట్రాలకూ డీలిమిటేషన్ వల్ల నష్టం జరుగుతుందని రేవంత్ రెడ్డి అన్నారు. యూపీ, బిహార్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ వంటి బిమారీ రాష్ట్రాలకు మాత్రమే దీంతో లబ్ది జరుగుతుందని తెలిపారు..ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో పర్యటిస్తున్నారు. పర్యటనలో భాగంగా పలువురు ముఖ్య నేతలను కలవనున్నారు. మరోవైపు.. 'ఇండియా టుడే' మీడియా సంస్థ నిర్వహించిన కాంక్లేవ్ కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెబుతూ.. మీరు కన్ఫ్యూజ్ అయినట్టే మేము మూడు లక్షల కోట్లే అప్పు అనుకున్నాం.. కానీ లెక్కలు చూస్తే రూ.7 లక్షల కోట్లు అప్పు ఉందని అన్నారు. కేసీఆర్ మూడు లక్షల కోట్ల అప్పే అని చెప్పారన్నారు. తెలంగాణలో 21 వేల కోట్లు రైతులకు రుణమాఫీ.. మూడు నెలల్లో చేసింది తమ ప్రభుత్వమేనని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. నియోజకవర్గ పునర్విభజనలో దక్షిణాది రాష్ట్రాలకు




అన్యాయం జరుగుతుందని వెల్లడించారు. సౌత్ ప్రాతినిధ్యం తగ్గించే పనిలో బీజేపీ ఉందని పేర్కొన్నారు. కుటుంబ నియంత్రణకు సౌత్ ఇండియా ప్రజలు కట్టుబడి ఉన్నారు.. ఇప్పుడు జనాభా ప్రకారం నియోజక వర్గాల విభజన అంటే ఎలా..? అని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. మోడీ జన గణన చేస్తున్నారు.. దాంట్లో కుల గణన కూడా చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్ ఇచ్చింది కాంగ్రెస్ అని తెలిపారు. ఇప్పుడు బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇస్తాం అంటున్నామని చెప్పారు. మరోవైపు.. భాషను బలవంతంగా రుద్దొద్దని సూచించారు. ఎక్కువ మంది మాట్లాడే భాష హిందీ.. రెండో భాష తెలుగు అని చెప్పారు. సివిల్స్‌లో తెలుగుని తొలగించారని తెలిపారు. కాంగ్రెస్ కు యూత్ కాంగ్రెస్.. మహిళా కాంగ్రెస్ అనుబంధ సంఘాలు ఉన్నాయని వెల్లడించారు. కానీ మోడీకి ఈడీ, సీబీఐ, ఇన్‌కం టాక్స్‌లు అనుబంధ సంఘాలని విమర్శించారు.కాంగ్రెస్ ప్రజాస్వామ్యం ఎక్కువ.. అద్వానీ, మురళీమనోహర్ జోషి లాంటి వాళ్లను పక్కన పెడితే సైలెంట్‌గా ఉన్నారు.. తమ పార్టీలో రాజ్యసభ సీటు ఒక్కసారి ఇవ్వకపోతే జంతర మంతర్ లో ధర్నా చేస్తారు.. అంత ప్రజాస్వామ్యం ఉంటుంది కాంగ్రెస్ పార్టీలోనని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. బీజేపీలో అది సాధ్యమేనా అని అన్నారు. అదానీ 100 కోట్లు వెనక్కి ఇవ్వాలని పార్టీ చెప్పలేదు.. తాను భద్రాచలంలో రాముడి గుడి ఉందని చెప్పా.. మోడీ, అమిత్ షాలను పిలిచా ఇప్పటి వరకు రాలేదన్నారు. మరోవైపు.. హైదరాబాద్‌లో ఒలంపిక్స్ నిర్వహించండి అని తాను లేఖ రాశానని తెలిపారు. అహ్మదాబాద్ కంటే తమ దగ్గర ఇన్ఫ్రాస్టక్చర్ ఎక్కువ అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

## 10న గ్రూప్-1 ఫలితాలు వెల్లడి

### ప్రకటించిన తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్




**హైదరాబాద్,మార్చి 7 :** గ్రూప్స్ ఫలితాల వెల్లడికి టీజీపీఎస్సీ తేదీలను ఖరారు చేసింది. ఈ నెల 10వ తేదీన గ్రూప్-1 ఫలితాలను వెల్లడించనుంది. 10 నుంచి 18వ తేదీ మధ్య గ్రూప్-1, 2, 3 ఫలితాలను విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. గ్రూప్-2 ఫలితాలకు సంబంధించి 11వ తేదీన జనరల్ ర్యాంకింగ్ జాబితా ప్రకటించనున్నారు. గ్రూప్-3 ఫలితాలకు సంబంధించి 14న జనరల్ ర్యాంకింగ్ జాబితా విడుదల చేయనున్నారు. ఈ నెల 17న హాస్టల్ వెల్ఫేర్ తుది ఫలితాలను, 19న ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్గ్ ÷నైల్ ఫలితాలను ప్రకటించనున్నట్లు టీజీపీఎస్సీ అధికారులు వెల్లడించారు రాష్ట్రంలో 563 గ్రూప్-1 పోస్టుల భర్తీకి నిర్వహించిన ప్రధాన పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం ముగిసింది. అభ్యర్థులు సాధించిన మార్కుల ఆధారంగా 1:2 నిష్పత్తిలో మెరిట్ జాబితా వెల్లడికి టీజీపీఎస్సీ తుది పరిశీలన కొనసాగిస్తోంది. షెడ్యూల్ ప్రకారం.. మార్చి 10న గ్రూప్-1 ఫలితాల విడుదల, అదే రోజు అభ్యర్థుల ప్రొవిజినల్ మార్కుల వివరాలనూ వెల్లడించనుంది. అనంతరం ఆయా అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన ఉంటుంది. మార్చి 11న గ్రూప్-2 జనరల్ ర్యాంకింగ్ జాబితాను ప్రకటించనుంది. 14న గ్రూప్-3 జనరల్ ర్యాంకింగ్ జాబితాను కమిషన్ వెల్లడించనుంది. 17న హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్, 19న ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ తుది ఫలితాలు విడుదల చేయనున్నారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో ట్విస్ట్

### అమెరికా నుంచి వేరే దేశానికి వెళ్లిన ప్రభాకర్‌రావు, శ్రవణ్‌కుమార్



**హైదరాబాద్,మార్చి 7 :** తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో ట్విస్ట్ చోటు చేసుకుంది. కీలక నిందితులుగా ఉన్న మాజీ ఎస్ఐబీ చీఫ్‌గా పని చేసిన ప్రభాకర్ రావు, ఒక మీడియా సంస్థ అధినేత శ్రవణ్ కుమార్ అమెరికా నుంచి మరో దేశానికి వెళ్లినట్టు అధికారులు గుర్తించారు. రెడ్ కార్నర్ నోటీస్ జారీ చేయడానికి కావల్సిన ప్రక్రియను సీఐడీ పూర్తి చేసి సీబీఐకి అందజేసింది. త్వరలోనే సీబీఐ రెడ్ కార్నర్ నోటీసులు ఇవ్వనుంది. రెడ్ కార్నర్ నోటీస్ సీబీఐ ఇవ్వగానే ఏ దేశంలో ఉన్న దొరికిపోతారని పోలీసులు చెబుతున్నారు. హైదరాబాద్ పోలీసులు పంపిన రెడ్ కార్నర్ నోటీస్ వినతిని సీబీఐకి సీఐడీ పంపించింది. కాగా.. ఈ కేసులో నిందితులుగా ఉన్న ప్రభాకర్ రావు, శ్రవణ్ కుమార్ అమెరికాలో తలదాచుకున్న విషయం తెలిసిందే. వీరిని విచారణ జరిపితే ఫోన్ ట్యాపింగ్ కేసులో అసలు వాస్తవాలు బయటపడతాయని హైదరాబాద్ పోలీసులు భావించారు. అయితే వారిని అమెరికా నుంచి హైదరాబాద్ రప్పించేందుకు.. అలాగే వీరిద్దరినీ తమకు అప్పగించాలని ఇప్పటికే సీబీఐకి సీఐడీ అధికారులు లేఖ రాశారు. సీబీఐకు కావాల్సిన సమాచారాన్ని అందజేశారు. సీబీఐ రెడ్ కార్నర్ నోటీసు ఇచ్చిన తర్వాత అమెరికాలో ఉన్న ఇద్దరిని అదుపులోకి తీసుకోవాలనే ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పుడు ప్రభాకర్ రావు, శ్రవణ్ రావు అమెరికా నుంచి వేరొక దేశానికి పారిపోయారని సమాచారం ఉంది. దీంతో హైదరాబాద్ పోలీసులు, సీఐడీ అధికారులు దీనిపై దృష్టి సారించారు. సీబీఐకి మరో లేఖను రాసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. రెడ్ కార్నర్ నోటీసు ఇచ్చేందుకు ఇప్పటికే ప్రక్రియ అంతా పూర్తి అయ్యింది. హైదరాబాద్ పోలీసులు సీఐడీకి సమాచారం ఇస్తే.. ఆ ప్రక్రియను పూర్తి చేసిన సీఐడీ.. దాన్ని సీబీఐకి అందజేసింది. రెడ్ కార్నర్ నోటీసు ఇచ్చే అధికారం సీబీఐకి ఉన్న నేపథ్యంలో ఈ వారంలోనే రెడ్ కార్నర్ నోటీసులు ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ఒక్కసారి రెడ్ కార్నర్ నోటీసులు ఇస్తే నిందితులు ఏ దేశంలో ఉన్నా కూడా వారిని కస్టడీలోకి తీసుకునే ఛాన్స్ ఉంటుంది. గత కొంతకాలంగా ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ ముందుకు సాగని పరిస్థితి. ఈ కేసులో అడిషనల్ ఎస్పీ, డీఎస్పీ ప్రణీత్ రావు, టాస్క్‌ఫోర్స్ ఓఎస్డీగా పనిచేసిన రాధాకిషన్ రావును అదుపులోకి తీసుకుని విచారణ జరిపి వారిని జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించారు. కొద్దిరోజుల క్రితమే వీరంతా కూడా బెయిల్‌పై బయటకు వచ్చారు. ఈ క్రమంలో ప్రభాకర్ రావు, శ్రవణ్ కుమార్‌ను విచారిస్తే ఇందులో రాజకీయ నేతల ప్రమేయానికి సంబంధించి ఒక క్లారిటీ వచ్చే అవకాశం ఉంటుంది. ఫోన్ ట్యాపింగ్ కేసు నమోదైన వెంటనే వీరిద్దరూ కూడా అమెరికాకు పారిపోయారు. ఇప్పుడు అమెరికా నుంచి మరోదేశానికి పారిపోయారనే సమాచారం హైదరాబాద్ పోలీసులకు అందింది. రెడ్ కార్నర్ నోటీసులు ఇచ్చాక ఏ దేశంలో ఉన్నా కూడా వీరిద్దరినీ అదుపులోకి తీసుకునే అవకాశం ఉంటుంది.

## ఆస్తిపన్ను చెల్లింపులో వడ్డీరాయితీ

### మరోమారు ఓటిఎస్ ప్రకటించిన ప్రభుత్వం

**హైదరాబాద్,మార్చి 7 :** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఆస్తి పన్ను చెల్లింపు బకాయిదారులకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. 90 శాతం వడ్డీ మాఫీతో మొత్తం ఒకేసారి పన్ను బకాయిలు చెల్లించేలా మరోసారి ఓటీఎస్‌ను అమలు చేస్తున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి దాన కిషోర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఓటీఎస్ పథకాన్ని ఉపయోగించుకొని నగరంలోని ఆస్తి పన్ను మొండి బకాయిలున్న వారు పన్ను చెల్లించాలని సూచించారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఓటీఎస్‌లో మొత్తం పన్నుతోపాటు వడ్డీ 10 శాతం చెల్లిస్తే సరిపోతుందని వెల్లడించారు. గతేడాది ప్రవేశపెట్టిన ఓటీఎస్ వల్ల సుమారు లక్ష మంది వినియోగదారులు ఆస్తి పన్ను చెల్లించారు. జీహెచ్‌ఎంసీ.. ఈ సారి ఆస్తి పన్నుకు సంబంధించి రూ.2 వేల కోట్లు వసూలు చేయడమే లక్ష్యంగా పెట్టుకుంది. ప్రభుత్వం ఓటీఎస్‌కు అంగీకరించడంతో ఆశించిన స్థాయిలో పన్నులు వసూలవుతాయని భావిస్తోంది.




## కళ్లెదుట జలదోపిడీ జరుగుతున్నా స్పందించరా..?

### ఇంత మొద్దునిద్ర సీఎంను నేనెప్పుడూ చూడలేదు : హరీశ్‌రావు

**హైదరాబాద్,మార్చి 7 :** బనకచర్ల ద్వారా గోదావరి వరద జలాలనే తీసుకువెళ్తున్నాం, తెలంగాణకు నష్టం లేదు అని ఏపీ నీళ్ల మంత్రి అంటే నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ మౌనం వహించడం వెనుక అంతర్యమేంటని ప్రశ్నించారు. మూడు నెలలుగా నాగార్జునసాగర్ కుడి కాలువ నుంచి రోజుకు 10వేల క్యూసెక్కులను ఏపీ తరలించుకుంటుంటే రాష్ట్ర ప్రభుత్వం మౌనంగా ఉందన్నారు. గోదావరి, కృష్ణా నీటిలో తెలంగాణ వాటాను ఏపీ ఇష్టారాజ్యంగా తరలలించే కుట్రలు చేస్తుంటే ఈ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి, ఉత్తం కుమార్ రెడ్డి సహా ఒక్క నాయకుడికి పట్టింపు లేదు అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. "బనకచర్ల తో తెలంగాణకు ఏమి నష్టం" అని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టంగా మాట్లాడి మూడు రోజులైనా ఒక్కరూ గట్టిగా స్పందించలేదు. తెలంగాణ నీటి ప్రయోజనాలు ఈ సర్కారుకు పట్టవా అక్రమంగా నీటిని తరలించుకు పోతుంటే మొద్దు నిద్రలో ఉంటారా..? చంద్రబాబును అడ్డుకునే ధైర్యం, కేంద్రాన్ని అడిగే దమ్ము కాంగ్రెస్, బీజేపీ ఎంపీలకు లేదా? చంద్రబాబుతో బీజేపీ, రేవంత్ దోస్తీ చేస్తూ తెలంగాణను మోసం చేస్తారా అని హరీశ్‌రావు ప్రశ్నించారు. బాబు, రేవంత్, బీజేపీ మధ్య లోపాయికార ఒప్పందం ఏమిటి? బిఆర్ఎస్ పార్టీ గొంతెత్తినా మీకు చలనం కలగదా? కాంగ్రెస్, బిజెపి తీరు తెలంగాణ తాగు, సాగు నీటి రంగానికి గొడ్డలి పెట్టుగా మారుతున్నది. తెలంగాణ ప్రయోజనాల కోసం బిఆర్ఎస్ పార్టీ పడుతున్న ఆరాటం మీకు ఎలాగూ అర్థం కాదు, కనీసం మీడియాలో వస్తున్న కథనాలను చూసైనా కదలండి. ఇప్పటికైనా ఏపీ ప్రభుత్వ జల దోపిడీని అడ్డుకోండి. కేంద్రాన్ని నిలదీయండి. రేవంత్ సహా బిజెపి ఎంపీలు, కేంద్ర మంత్రులు మౌనం వీడండి! అని హరీశ్‌రావు సూచించారు.

### ఉమ్మడి రాష్ట్రంలో చూసిన కష్టాలు మళ్లీ మొదలు

**మండుటెండలు రాకముందే.. నీటికష్టాలు**

**మంచినీటి కష్టాలు తీర్చడంలో కాంగ్రెస్ విఫలం : హరీశ్‌రావు**

**సిద్దిపేట,మార్చి7 :** ఉమ్మడి రాష్ట్రంలో తాండవించిన మంచినీటి కష్టాలు మళ్లీ మొదలయ్యాయని, మంచినీటి సమస్యను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఈ తాగునీటి కష్టాలపై హరీశ్‌రావు స్పందించారు. ఆదిలాబాద్ జిల్లా బజార్ హత్నూర్ మండలం చింతకర్ర గ్రామ గిరిజనులు తాగు నీటి కోసం పడుతున్న కష్టం ఇది అని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఉమ్మడి పాలన నాటి నీటి గోస దృశ్యాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వల్ల మళ్ళీ చూస్తున్నామని మండిపడ్డారు. మిషన్ భగీరథ నీళ్ల సరఫరాలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం వేసవి వేళ మారుమూల ప్రజలకు శాపంగా మారిందని పేర్కొన్నారు. భుజాలు కాయలు కాసేలా బిందెలు మోస్తూ, వాగులు, వ్యవసాయ బావుల నుండి నీళ్ళు తెచ్చుకునే దుస్థితిని కల్పించింది. పథకాలు అమలులో వైఫల్యం.. పరిపాలనలో వైఫల్యం.. చివరకు కేసీఆర్ ప్రారంభించిన మిషన్ భగీరథ ద్వారా నీళ్ళు సరఫరా చేయడంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం చెందిందని హరీశ్‌రావు ధ్వజమెత్తారు.

## అర్హులకు రేషన్‌కార్డులు ఇస్తాం : మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



**ఖమ్మం,మార్చి 7 :** అర్హులైన వారికి తప్పకుండా రేషన్ కార్డులు ఇస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస ిండ్డి తెలిపారు. కూసుమంచిలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మంత్రి పొంగులే టి శ్రీనివాసరెడ్డి మీడియాతో మాట్లాడారు. పేదవారి ప్రభుత్వం కావాలని ఇందిరమ్మ రాజ్యం తెచ్చుకుని 15 నెలలు అయ్యిందని తెలిపారు. ఎన్నికల ముందు తాము ఇచ్చిన హామీలను కొన్ని పూర్తి చేశాం, మిగిలిన వాటిని కూడా త్వరలోనే పూర్తి చేస్తామని పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నియోజకవర్గానికి 3500 ఇళ్లను ఇచ్చే కార్యక్రమం వారంలో ప్రారంభమవుతుందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు బాగోలేని కారణంగా తు లం బంగారం కొంత ఆలస్యమవుతుందని చెప్పారు. గత కేసీఆర్ ప్రభుత్వం అభివృద్ధి పేరుతో అరాచకం సృష్టించిందని విమర్శించారు. వాటన్నింటినీ గాడిన పెడుతూ తమ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమాలను చేపడుతున్నామని అన్నారు. ఎక్కడ తగ్గకుండా సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని అన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని తెలిపారు. ఇచ్చిన ప్రతి హామీని ఆలస్యమైనా నిలబెట్టుకుంటామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

## బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకులపై కేసీఆర్ సమీక్ష

మొదటి పేజీ తరువాయి



ఈ సన్నాహక సమావేశానికి కేటీఆర్, హరీశ్‌రావు, మధుసూదనాచారి, శ్రీనివాస్ గౌడ్, నిరంజన్ రెడ్డి, కేఆర్ సురేశ్, బండా ప్రకాశ్, సబితా ఇంద్రారెడ్డి, కవిత, గంగుల కమలాకర్, తలసాని శ్రీనివాస్ యాదవ్, వినోద్ కుమార్, ఎర్రబెల్లి దయాకర్ రావు, లక్ష్మారెడ్డి, పద్మారావు గౌడ్, జగదీశ్ రెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, దేశపతి శ్రీనివాస్, శేరి సుభాష్ రెడ్డితో పాటు పలువురు నేతలు పాల్గొన్నారు.

## ప్రభుత్వం ఆధ్వర్యంలో నేడు అఖిలపక్ష భేటీ

మొదటి పేజీ తరువాయి



ఏర్పాటు చేసి, అన్ని పార్టీలకు ఆహ్వానం పంపించింది. కేంద్రంలో పెండింగ్ సమస్యల పరిష్కారం ఎంజెడాగా ఈ సమావేశం జరుగనుంది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన ఉదయం 11 గంటలకు ప్రజాభవన్‌లో సమావేశం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్యఅతిధిగా హాజరుకానున్నారు. అలాగే కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండిసంజయ్‌లకు ఆహ్వానం పంపారు. అలాగే తెలంగాణ ఎంపీలందరికీ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఫోన్ చేసి ఆహ్వానించారు. అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని గురువారం జరిగిన కేబినెట్ సమావేశంలోనే నిర్ణయించారు. జానారెడ్డి, భట్టి విక్రమార్క నేతృత్వంలో కమిటీని వేసి ఈసమావేశాన్ని నిర్వహించి రాష్ట్రానికి కేంద్రం నుంచి రావాల్సిన వాటాలు, రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలపై అఖిలపక్షంగా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని ఇప్పటికే ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా కేబినెట్‌లో తీర్మానం చేయడంతో పాటు భట్టి, జానా నేతృత్వంలో కమిటీని కూడా వేసింది. వెంటనే రంగంలోకి దిగిన కమిటీ.. స్వయంగా అన్ని పార్టీలకు సంబంధించిన ఎంపీలకు భట్టి ఫోన్‌లు చేసి సమావేశానికి రావాల్సిందిగా ఆహ్వానించారు. ఉదయం 11 గంటలకు ప్రజాభవన్‌లో ఆల్ పార్టీ ఎంపీల సమావేశం నిర్వహించనున్నారు. భట్టి, జానారెడ్డి నేతృత్వంలో జరుగనున్న ఈ సమావేశానికి సీఎం రేవంత్ రెడ్డి కూడా హాజరుకానున్నారు. బీజేపీకి సంబంధించిన ఎంపీలను కూడా సమావేశానికి రావాల్సిందిగా ఆహ్వానించారు. అందులో ప్రధానంగా కేంద్ర మంత్రులుగా ఉన్న బండి సంజయ్, కిషన్ రెడ్డిలకు కూడా ఆహ్వానాన్ని పంపారు. స్వయంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఫోన్ చేసి వారిని సమావేశానికి రావాల్సిందిగా ఆహ్వానించారు. పార్లమెంటులో తెలంగాణ నుంచి బిజెపికి 8, కాంగ్రెస్‌కు 8మంది లోక్‌సభ సభ్యులు ఉన్నారు. అలాగే ఎఐఎం నుంచి అసదుద్దీన్ ఒక్కరే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. బిఆర్ఎస్‌కు కేవలం రాజ్యసభలో మాత్రమే సభ్యులు ఉన్నారు.

# మహిళల సాధికారితకు పెద్దపీట

**వారు స్వయం శక్తితో ఎదగాలన్నదే లక్ష్యం**

**ఇందిరమ్మ రాజ్యంలో మహిళల ఆర్తికాభివృద్ధి**

**మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన సీతక్క**



**హైదరాబాద్,మార్చి 7 :** మహిళలకు మంత్రి సీతక్క అంతర్జాతీయ మహిళా దినోత్సవం శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ రోజు మహిళలందరికీ శుభ దినం అని,మహిళలు ఆర్థికంగా ఎదిగే విధంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోంది ఇందిరమ్మ రాజ్యం అన్నారు. ప్రజా ప్రభుత్వం వచ్చిన వెనువెంటనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పించింది ఉచిత ప్రయాణమే కాకుండా ఆ బస్సులకు ఓనర్లుగా మహిళలను చేయడం ప్రజా ప్రభుత్వం చేపట్టిన విజయం అన్నారు. ప్రతి మహిళ ఆర్థికంగా ఎదగాలని, ప్రతి కుటుంబం అభివృద్ధి చెందాలని, అన్ని రంగాల్లో వారిని ముందంజలో ఉంచాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం ఫ్రీ ప్రయాణం నుంచి బస్సు ఓనర్లుగా మహిళలను మార్చాం అని అన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగే విధంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందని అభిప్రాయపడ్డారు. పది మందికి ఉపాధి కల్పించే విధంగా మహిళలు ఎదిగారని సీతక్క చెప్పారు. ఇందిరా శక్తి క్యాంటీన్, పెట్రోల్ బంకులు, గ్రామీణ ప్రాంతాల్లో పౌల్ట్రీ, పాడి పశువుల పెంపకం వంటి వినూత్న పథకాలు ప్రారంభించామన్నారు. మహిళా సంఘాలకు వ్యాపారం ఏర్పాటు చేసుకోవడానికి ప్రభుత్వము వడ్డీ లేకుండా రుణ సదుపాయం కల్పిస్తున్నామని వెల్లడించారు. 21 వేల కోట్లకు పైగా రుణాలిచ్చాం.. వడ్డీలు, చక్ర వడ్డీలు అప్పుల బాధకు కుటుంబాలు బలి కాకుండా వడ్డీ లేని రుణాలు ఇస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ రాజ్యం, ప్రజా ప్రభుత్వంలో మహిళలందరూ సంతోషంగా ఉన్నారని మంత్రి సీతక్క పేర్కొన్నారు. మహిళా సంఘం అంటే ఆర్థిక భద్రత, సామాజిక రక్షణ.. మహిళా సంఘంలో చేరడం వలన ఒక సామాజిక భద్రత ఉంటుందని మంత్రి సీతక్క తెలిపారు. అందుకే 60 ఏళ్లు దాటిన మహిళలకు మహిళా సంఘంలో చేర్చుకుంటున్నామన్నారు. మహిళలు చదువు మానేసి అనేక రకాల మానసిక వేదన గురైన సందర్భాలు ఉన్నాయి.. కాబట్టి 15 సంవత్సరాల నుంచి 18 సంవత్సరాల లోపు కూడా మహిళా సంఘంలో సభ్యులుగా చేర్చుకునే అవకాశం కల్పించామని చెప్పారు. మహిళా సంఘం సభ్యురాలుగా ఉండి ఏదైనా ప్రమాదంలో మృతి చెందితే వారికి 10 లక్షల ఇన్సూరెన్స్ లోన్ బీమా అందిస్తున్నామన్నారు. మహిళలు వంటగదికే పరిమితం కాకుండా రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములను చేస్తున్నామని సీతక్క తెలిపారు. అదానీ, అంబానీలకే పరిమితం అయిన సోలార్ విద్యుత్ ఎ÷-లాంట్లను మహిళా సంఘాలకు అప్పగిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అందరి సోదరుడుగా అండగా ఉంటూ ప్రజా పాలన అందిస్తున్నారని వెల్లడించారు. మహిళలు ఏ బిజినెస్ పెట్టుకోవాలన్న సీఎం రేవంత్ రెడ్డి ఒక సోదరుడుగా అండదండగా నిలబడి పనిచేస్తున్నారు.. మహిళలంతా ఈ ప్రభుత్వాన్ని దీవించండని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

# బీసీలపై కవిత మాటలు దయ్యాలు వేదాలు వల్లించినట్లుంది

**బీసీలపై చిత్తశుద్ధి ఉంటే బీఆర్ఎస్ పార్టీ ప్రెసిడెంట్ పదవి బీసీలకు ఇవ్వాలి**

**ఈటలను వేధించి ఎందుకు బటయకు పంపారు : ఎంపీ రఘునందన్‌రావు**



**సిద్దిపేట,మార్చి7 :** రాజకీయ లబ్ధికోసం బీసీలపై ప్రేమ ఉన్నట్టు ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతున్నారు.. తప్ప బీసీలకు అన్యాయం చేసింది బీఆర్ఎస్ పార్టీనేనని ఎంపీ రఘునందన్‌రావు విమర్శించారు. కవితకు బీసీలపై చిత్తశుద్ధి ఉంటే కేసీఆర్‌తో మాట్లాడి పార్టీ ప్రెసిడెంట్ పదవి బీసీకి ఇప్పించాలని కవితకు సవాల్ విసిరారు. బీసీలకు అన్యాయం జరిగిందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతుంటే దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని విమర్శలు చేశారు. గజ్వేల్ పట్టణంలో శుక్రవారం మెదక్ ఎంపీ రఘునందన్ రావు మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రఘునందన్‌రావు మాట్లాడారు. శాసనసభలో పార్టీ ప్రతిపక్ష నాయకుడిని బీసీ నేతకు ఇవ్వండి. శాసన మండలిలో కూడా మరో బీసీ నేతకు ఇవ్వాలని ఛాలెంజ్ చేశారు. ఇచ్చిన నాలుగు మంత్రి పదవులు బీసీలకు ఎందుకు ఇవ్వరని రఘునందన్ రావు ప్రశ్నించారు. ఈటెల రాజేందర్ బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు బీసీల్లో పెద్ద సామాజిక వర్గానికి చెందిన ఈటెలను మధ్యలోనే మంత్రి పదవి నుంచి ఎందుకు తీసేశారని ఎంపీ రఘునందన్ రావు నిలదీశారు. కేసీఆర్ కుటుంబానికి పదవులు కావాలి.. మరి బీసీలకు పదవులు ఎప్పుడు ఇస్తారని ప్రశ్నల వర్షం కురిపించారు. ఈ రోజు ఫామ్‌హౌస్ చర్చలో కేసీఆర్‌తో తాను చెప్పిన విషయంపై కవిత మాట్లాడాలని సవాల్ విసిరారు. ఢిల్లీ ముఖ్యమంత్రి అవకాశం వస్తే బీజేపీలో ఒక మహిళకు ఇచ్చామని గుర్తుచేశారు. మొదటి ఐదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక్క మహిళకు కూడా మంత్రి పదవి ఇవ్వలేని ఒకే ఒక కేబినెట్ ఈ దేశంలో ఏదైనా ఉంటే అది కేసీఆర్ కేబినెట్ అని విమర్శించారు. బీజేపీని విమర్శించే ముందుగా బీఆర్ఎస్ చేసిన తప్పులు సరిదిద్దుకోవాలని చెప్పారు. బీజేపీ వైపు వేలెత్తి చూపించే బదులు ముందుగా బీఆర్ఎస్ నేతలు తప్పులు సరిదిద్దుకోవాలని మెదక్ ఎంపీ రఘునందన్ రావు హితవు పలికారు.

# నియోజకవర్గాలు ఒక్కటి కూడా తగ్గవు

**మోడీ నాయకత్వంలో త్వరలో జనగణన**

**వచ్చే పార్లమెంట్ నాటికి మహిళా రిజర్వేషన్లు**

**మహిళా దినోత్సవ శుభాకంక్షలు తెలిపిన కిషన్ రెడ్డి**



**హైదరాబాద్,మార్చి 7 :** త్వరలోనే మోదీ నేతృత్వంలో జన గణన జరగబోతుందని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి తెలిపారు. అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాల పునర్విభజన జరగబోతుం దన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల నాటికి మహిళల రిజర్వేషన్లు అమలు అవుతాయని పేర్కొన్నారు. ఇప్పుడున్న స్థానాల్లో ఏ ఒక్క సీటు తగ్గకుండా అసెంబ్లీ, లోక్ సభ స్థానాల పునర్విభజన జరుగుతుందని వెల్లడించారు. కావాలనే ఇక్కడున్న రేవంత్ సర్కార్.. బీఆర్ఎస్, డీఎంకే పార్టీలు తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయని పేర్కొన్నారు. ఏ రాష్ట్రంలో కూడా ఏ ఒక్క సీటును కూడా తగ్గించే ఆలోచన తమకు లేదని చెప్పారు. కొంతమంది దక్షిణ భారతంలో ఆల్ పార్టీ మీటింగ్ అంటూ హడావుడి చేస్తున్నారు.. జనాభా లెక్కల సేకరణ చేస్తూ నియోజకవర్గాల పునర్విభజన చేస్తామని తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి మహిళలందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బిజెపి కార్యాలయంలో జరిగినకార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతున్నాయి.. అన్ని స్థానాల్లో బీజేపీ పోటీ చేస్తుందని వెల్లడించారు. మహిళా రిజర్వేషన్ స్థానాల్లో ఒక్కటి కూడా వదిలిపెట్టవద్దు.. కుటుంబ రాజకీయాలు వద్దు.. ఇది మంచి సంప్రదాయం కాదని కిషన్ రెడ్డి సూచించారు. మహిళను శక్తిగా కొలిచే సంప్రదాయం ఒక్క భారత్‌లోనే ఉందని అన్నారు. ఇంటిని నడిపే మాతృమూర్తి మహిళ అని పొగిడారు. పార్టీలో ఎలాంటి బాధ్యతలు ఇచ్చిన అద్భుతంగా మహిళా మోర్చా నేతలు పని చేస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా మహిళలు బాగా పని చేశారు.. దేశ సరిహద్దుల్లో రక్షణ విభాగంలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని అభిప్రాయపడ్డారు. ప్రపంచంలోనే అత్యధిక మహిళా పైలట్లు ఇండియాలో ఉన్నారు.. ముస్లిం మహిళల కోసం ట్రిపుల్ తలాక్ రద్దు చేసిన ప్రభుత్వం మోదీది అని కిషన్ రెడ్డి తెలిపారు. ప్రసూతి సెలవులు 26 వారాలకు పొడిగించిన ఘనత మోదీ సర్కార్‌ది అన్నారు. కొత్త పార్లమెంట్ భవనంలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల బిల్లునే ఆమోదించారని పేర్కొన్నారు. మరోవైపు.. 2014-2019 తొలి తెలంగాణ ప్రభుత్వంలో మహిళా మంత్రి లేకుండా పాలన సాగిందని ఆరోపించారు. ఎక్కువ మంది మహిళలకు ప్రాధాన్యత ఇచ్చిన పార్టీ బీజేపీ అని కిషన్ రెడ్డి తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో కాలికి గజ్జె కట్టి మండుటెండల్లో మహిళలు పాల్గొన్నారు.. కాంగ్రెస్ కూడా బీఆర్ఎస్ లానే పాలన చేస్తోందని మండిపడ్డారు. ఫ్రీ బస్ ఇచ్చిన రేవంత్.. అందులో తిరుగుతూ మిగిలిన హామీలు అమలు చేసినట్లు ఫీల్ అవ్వమని మహిళలకు చెబుతున్నారన్నారు. తెలంగాణలో డబుల్ ఇంజిన్ సర్కారు రావాల్సిన అవసరం ఉంది.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో 90 శాతం మహిళా టీచర్లు, గ్రాడ్యుయేట్లు బీజేపీకి ఓటు వేశారని తెలిపారు. మహిళలు పిడికిలి బిగించి రేవంత్ సర్కారును నిలదీయాలని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

# ఎమ్మెల్సీ సీటు కోసం కాంగ్రెస్‌లో ఆశావహుల ఆశలు

## 5 ఎమ్మెల్సీ స్థానాలకు 20వ తేదీన పోలింగ్

**కాంగ్రెస్‌కు నాలుగు ఎమ్మెల్సీలు దక్కే అవకాశం**

**సామా రామ్మోహన్ రెడ్డికి ఇచ్చే అవకాశం**



హైదరాబాద్,మార్చి7 : ప్రస్తుతం రాష్ట్రంలో ఎమ్మెల్యే కోటాలో 5 ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీగా ఉన్నాయి. మార్చి 29వ తేదీ నాటికి శాసన మండలిలో ఐదు స్థానాలు ఖాళీ కాబోతున్నాయి. ఈ స్థానాలు భర్తీ చేసేందుకు ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది. మార్చి 20వ తేదీన పోలింగ్ జరుగనుంది. దీంతో ప్రధాన పార్టీల్లోని ఆశావహులు ఎమ్మెల్సీ సీటు దక్కించుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ముఖ్యంగా అధికార కాంగ్రెస్ పార్టీలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ సీటు పొందేందుకు రాష్ట్ర స్థాయి నుంచి ఢిల్లీ స్థాయి వరకు లాబీయింగ్‌లు చేస్తున్నారు. ఈ 5 సీట్లలో కాంగ్రెస్‌కు 4 దక్కే అవకాశం ఉంది. 4 ఎమ్మెల్సీలు గెలిచే అవకాశం ఉండటంతో కాంగ్రెస్ పార్టీలో ఆశావహుల తాకిడీ ఎక్కువైంది. టిక్కెట్ కోసం ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు. ఎమ్మెల్సీ రేసులో జీవన్ రెడ్డి, జగ్గారెడ్డి, వేం నరేందర్ రెడ్డి, సామ రామ్మోహన్ రెడ్డి, జట్టి కుసుమ కుమార్, కుమార్ రావు, హర్కార వేణు గోపాల్ రావు, అంజన్ కుమార్ యాదవ్, చరణ్ కౌశిక్, సునీతా రావు, సరితా యాదవ్ పేర్లు వినిపిస్తున్నాయి. వీరంతా పార్టీ అధిష్టానాన్ని ప్రసన్నం చేసుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. వరి ప్రయత్నాలు ఎలా ఉన్నా.. ఎమ్మెల్యే కోటాలో టీపీసీసీ మీడియా కమిటీ ఛైర్మన్ సామా రామ్మోహన్ రెడ్డికి ఎమ్మెల్సీ కన్ఫామ్ అయినట్లు సమాచారం అందుతోంది. సామాన్య కార్యకర్త స్థాయి నుంచి టీపీసీసీ మీడియా కమిటీ ఛైర్మన్‌గా, పార్టీ అధికార ప్రతినిధిగా ఎదిగారు సామ. అడ్వకేట్‌గా, మీడియా స్పోక్స్‌పర్సన్‌గా కాంగ్రెస్ పార్టీకి ఎన్నో విధాలుగా సేవలు అందిస్తున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంలో సామ కృషి కూడా ఉందని ఆ పార్టీ నాయకులే అంటున్నారు. బలమైన బీఆర్ఎస్ పార్టీ నేతలను తన వాగ్ధాటితో ఎదుర్కొని.. ప్రజల్లో నాటి ప్రభుత్వ తీరును, అరాచకాలను, అక్రమాలను ఎండగట్టిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. యువ నాయకుడిగా.. నిత్యం ప్రజలతో మమేకమవుతూ వచ్చిన సామకు ఎమ్మెల్సీ ఇస్తే పార్టీకి మరింత ప్రయోజనం చేకూరుతుందంటున్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సారథ్యంలో పార్టీలో యువతకు అధిక ప్రాధాన్యత ఇస్తూ వస్తున్నారు. యువతకు అవకాశాలు ఇవ్వడం ద్వారా కాంగ్రెస్ మరింత బలపడే అవకాశం అధికంగా ఉంటుంది. అందుకే.. రాష్ట్రంలోనూ యువ నాయకులను పార్టీ ప్రోత్సహిస్తోంది. అందులోనూ సామా రామ్మోహన్ రెడ్డి చాలా నేర్పరి. బీఆర్ఎస్‌లోని అగ్ర నాయకులను సైతం ఎదుర్కొన్న రాజకీయ చతురత కలిగిన నాయకుడు. ఇలాంటి నాయకుడికి ఎమ్మెల్సీ ఇస్తే.. యువతకు మంచి సందేశం పంపినట్లు అవుతుందని పార్టీలోని యువ నాయకులు అభిప్రాయపడుతున్నారు. కేవలం టీపీసీసీ మీడియా కమిటీ ఛైర్మన్‌గానే.. విపక్ష నాయకులను చెడుగుడు ఆడుకుంటున్న సామకు.. ఎమ్మెల్సీ ఇస్తే మరింత బలం చేకూరుతుందని అంచనా వేస్తున్నారు. కష్ట సమయాల్లోనూ కాంగ్రెస్‌కు అండగా ఉంటూ.. కాంగ్రెస్ అధికారి ప్రతినిధిగా సేవలందించిన సామకే ఎమ్మెల్సీ ఇవ్వాలని పార్టీలోని యువ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. సామకు ఎమ్మెల్సీ ఇస్తే.. పార్టీలో యువతను మరింత ప్రోత్సహించినట్లు అవుతుందని తమ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# భార్య,అత్త వేధింపులు.. టెకీ ఆత్మహత్య

**ఆత్మహత్యకు ముందు కంపెనీకి సూసైడ్ నోట్**


**ముంబై,మార్చి 7 :** భార్య వేధింపులు తాళలేక భర్త ఆత్మహత్య చేసుకుంటున్న ఘటనలు దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపుతున్నాయి. ముఖ్యంగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల వరస ఆత్మహత్య ఘటనలు చర్చనీయాంశంగా మారుతున్నాయి. మొన్న అతుల్ సుభాష్, నిన్న మానవ్ శర్మ బలవన్మరణానికి పాల్పడగా.. తాజాగా నిషాంత్ త్రిపాఠి అనే టెకీ ఆత్మహత్య సంచలనం సృష్టిస్తోంది. అయితే ఆత్మహత్యకు ముందు వారు విడుదల చేస్తున్న వీడియో, సూసైడ్ నోట్లు పలువురిని కన్నీటిపర్యంతం చేస్తున్నాయి. ముంబైకి చెందిన నిషాంత్ త్రిపాఠి(41)కి అపూర్వ పారిఖ్‌తో కొన్నేళ్ల క్రితం వివాహం అయ్యింది. వారి మధ్య మనస్పర్థలు రావడంతో నిషాంత్ అత్త ప్రార్థన కుంపటిని మరింత రగిలించింది. గొడవలు పెద్దవయ్యేలా ఇద్దరినీ రెచ్చగొట్టింది. అపూర్వ, ఆమె తల్లి ప్రార్థన కలిసి నిషాంత్‌ను తీవ్రంగా వేధించారు. మానసికంగా హింసించారు. ఆ బాధలు భరించలేని అతను ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. ఈ మేరకు గత శుక్రవారం ముంబై నగరంలోని సహారా హోటల్‌లో అద్దెకు దిగాడు. తన గది బయట తలుపునకు 'డు నాట్ డిస్టర్బ్' అనే బోర్డు పెట్టాడు. దీంతో అతన్ని ఎవ్వరూ కదలించలేదు. అయితే ఆత్మహత్యకు ముందు తాను పని చేస్తున్న కంపెనీ వెబ్‌సైట్‌కు సూసైడ్ నోట్‌ను పంపాడు నిషాంత్. అనంతరం ఫ్యాన్‌కు ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. మూడ్రోజులైనా నిషాంత్ గది నుంచి బయటకు రాకపోవడంతో హోటల్ సిబ్బందికి అనుమానం వచ్చింది. వారి వద్ద ఉన్న మరో తాళంచెవితో నిషాంత్ గది తలుపు ఓపెన్ చేశారు. నిషాంత్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని కనిపించాడు. దీంతో హోటల్ సిబ్బంది వెంటనే సమాచారాన్ని పోలీసులకు అందించారు. హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్న ఖాకీలు.. మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం సూసైడ్ నోట్ స్వాధీనం చేసుకున్నారు. కాగా, అందులోని అంశాలు పోలీసుల కళ్లను సైతం చమర్చేలా చేశాయి. 'నువ్వు(అపూర్వ) దీన్ని చదివే సమయానికి, నేను చనిపోయి ఉంటాను. నా చివరి క్షణాల్లో జరిగిన ప్రతి దానికీ నిన్ను ద్వేషించాల్సి ఉంది. కానీ, అలా చేయలేదు. నిన్ను ద్వేషించాల్సిన సమయంలోనూ ప్రేమించాను. అప్పుడూ ప్రేమించా, ఇప్పుడు ప్రేమిస్తున్నా, నేను చనిపోయినా తర్వాతా ప్రేమిస్తా. నీపై నా ప్రేమ మారదని ప్రమాణం చేస్తున్నా. నువ్వు, మీ అమ్మ ప్రార్థన వల్లే చనిపోతున్నా. మీరు నన్ను ఎన్నో ఇబ్బందులకు గురి చేశారు. మానసికంగా వేధించారు. ఆ విషయం మా అమ్మకి కూడా తెలుసు. నేను చనిపోయిన తర్వాత మీరిద్దరూ నా తల్లి వద్దకు వెళ్లకండి. ఆమె ఇప్పటికే చాలా విసిగిపోయింది. ఆమెను ప్రశాంతంగా వదిలివేయండి' అంటూ రాశాడు. నిషాంత్ తల్లి చతుర్వేది సైతం కుమారుడి మరణంపై స్పందిస్తూ ఫేస్ బుక్‌లో ఓ పోస్టు పెట్టారు. 'నా జీవితం మునిగిపోయింది. నా కొడుకు నిషాంత్ నన్ను వదిలేసి వెళ్లిపోయాడు. నేను ఇప్పుడు ఒక సజీవ శవంలా మారిపోయాను. అతను నా అంత్యక్రియలు చేయాలి, కానీ నేనే అతనికి చేయాల్సి వచ్చింది. నా కూతురు ప్రాచి తన అన్నయ్య అంత్యక్రియలు నిర్వహించింది. జీవితంలో ఇంతపెద్ద పిడుగుపాటును భరించగలిగేలా ధైర్యం ఇవ్వండి' అంటూ బాధిత తల్లి పేర్కొంది.

# ఏప్రిల్ లోగా బిజెపి జాతీయ అధ్యక్షుడి ఎన్నిక: లక్ష్మణ్



**న్యూఢిల్లీ,మార్చి 7 :** ఏప్రిల్ లోపు భాజపా జాతీయ అధ్యక్షుడి ఎన్నిక పూర్తవుతుందని ఆ పార్టీ ఎంపీ లక్ష్మణ్ అన్నారు. దిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. భారాస అనేది గత చరిత్ర అని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రత్యామ్నాయ శక్తిగా భాజపా ఎదిగిందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ముగ్గురు అభ్యర్థులను పోటీలో పెట్టిన ఏకైక పార్టీ తమదని చెప్పారు. 10 సంవత్సరాలు అధికారంలో ఉన్న భారాసకు అభ్యర్థులను నిలబెట్టలేని పరిస్థితి ఏర్పడిందని ఎద్దేవా చేశారు. గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ మోసగించిందని విమర్శించారు. ప్రజలను ఆర్థికంగా శక్తిమంతం చేయడమే ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యమన్నారు.

# తెలంగాణలో 21మంది ఐపీఎస్‌ల బదిలీ




**హైదరాబాద్,మార్చి 7 :** తెలంగాణ రాష్ట్రంలో 21 మంది ఐపీఎస్ అధికారులకు స్థాన చలనం కలిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. బదిలీ ఐన అధికారుల్లో ఒక అడిషనల్ డీజీ, ఇద్దరు ఐజీపీలు, ఇద్దరు డీఐజీలు ఉన్నారు. ఇద్దరు నాన్ క్యాడర్ ఎస్పీలకు సైతం స్థాన చలనం కల్పించారు. మిగిలిన 14 మంది ఎస్పీలను కూడా బదిలీ చేశారు. కరీంనగర్ పోలీస్ కమిషనర్‌గా గౌస్ ఆలంను నియమించారు. బదిలీ అయిన అధికారుల వివరాలు ఇలా ఉన్నాయి. కరీంనగర్ పోలీస్ కమిషనర్‌గా గౌస్ ఆలం, అదనపు డీజీ (పర్సనల్)గా అనిల్ కుమార్. అలాగే ఎస్పీఎఫ్ డైరెక్టర్‌గా కూడా అదనపు బాధ్యతలు. సీఐడీ డీజీగా ఎం.శ్రీనివాసులు, వరంగల్ కమిషనర్‌గా సన్‌ప్రీత్ సింగ్, నిజామాబాద్ కమిషనర్‌గా సాయి చైతన్య, రామగుండం కమిషనర్‌గా అంబర్ కిషోర్, ఇంటెలిజెన్స్ ఎస్పీగా సింధు శర్మ, భువనగిరి డీసీపీగా అకాంక్ష యాదవ్, మహిళా భద్రతా విభాగం ఎస్పీగా చేతన, నార్కోటిక్ బ్యూరో ఎస్పీగా రూపేష్, కామారెడ్డి ఎస్పీగా రాజేష్ చంద్ర, సంగారెడ్డి ఎస్పీగా పారితోష్ పంకజ్‌లు బదిలీ అయిన వారిలో ఉన్నారు.

మానేరు
జనత
తెలుగు దినపత్రిక ఇది జనం గొంతుక
www.epaperjanathadaily.in
శనివారం 8 మార్చి 2025





# మహిళలకు అగ్రాసనంతోనే అభివృద్ధి!

ఏటా ప్రపంచ మహిళా మహిళా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంటున్నా..భారత్‌లో మాత్రం ఇంకా మహిళా సాధికారత రావడం లేదు. మహిళను విలాసవస్తువుగానే చూస్తున్నారు. అనేకానేక అవరోధాల మధ్య కూడా తమతమ రంగాలలో శక్తిమంతమైన మహిళగా ఆమె నిరూపించుకుంటూనే ఉంది. వ్యక్తిత్వ హననం జరుగుతున్నా..సమాజంలో తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకుంటూనే ఉంది. మహిళాభ్యుదయమే దేశాభ్యుదయం అని మనమంతా కీర్తిస్తూ వారిని మభ్య పెడుతున్నామని గుర్తించాలి. మహిళా సమానత్వమే సమాజానికి హితం చెబుతున్న పాలకులు సమాన గౌరవం ఇచ్చి చట్టసభల్లో ప్రవేశించేలా చేయడంలో మాత్రం విఫలం అవుతున్నారు. మహిళల్లో స్ఫూర్తిని నింపడమే గాకుండా, వారిలో ఆత్మస్థయిర్యాన్ని నింపి వారిని మనతో సమానంగా ముందుకు తీసుకుని వెళ్లడంలో పురుష సమాజం విఫలమయ్యిందన డంలో సదేహం లేదు. ఇక దీనిని సవాల్‌గా తీసుకుని మహిళలే తమ హక్కుల కోసం పోరాడాలని గుర్తుంచుకోవాలి. మహిళల రక్షణకు మరిన్ని కఠిన చట్టాలు తీసుకుని వస్తే తప్ప వారికి రక్షణ కల్పించలేం. హత్యలు, అత్యాచారాలు నిరోధానికి పాలకులు కఠినంగా వ్యవహరించడం లేదు.మహిళలను గౌరవించే మనదేశంలో మహిళల కోసం ఏం చేశారంటూ ఏమీ లేదు.ఓ గిరిజన మహిళను రాష్ట్రపతిగా చేయడం మాత్రం అభినందించాల్సందే. ఘనత వహించిన మోడీకి ఇవన్నీ తెలియనివి కాదు. మహిళా బిల్లును ఆమోదించినా..అది అందని ద్రాక్షగా మిగిలింది. జనాభా లెక్కల సేకరణ తరవాత డీ లిమిటేషన్‌తో దానికి లంకె పెట్టారు. దీంతో మరో రెండుమూడేళ్లు వేచిచూడక తప్పదు. ప్రధానంగా మహిళలకు ఉద్యోగ,ఉపాధి హామీల్లో పెద్దపీట వేయాలి. అలాగే వారికి ఉచిత విద్యను అందచేయాలి. ఉన్నత చదువులకు వెళ్లే వారికి వడ్డీరహిత రుణాలు అందించాలి. మహిళా సదస్సులు నిర్వహిస్తూ....మహిళల గురించి గొప్పగా చెప్పుకుంటున్నా వారి అభివృద్ధికి ప్రత్యేక కార్యక్రమాలు ముందుకు సాగడం లేదు. బేటీపడావో..బేటీ బచావో నినాదంగా మారింది. ఆడపిల్లల చదువులకు, క్రీడలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు ఏవీ అమలు కావడం లేదు.ఆడపిల్లల చదువులకు ప్రత్యేక రుణాలు, వడ్డీలేని పథకాలు అమలుచేసివుంటే బాగుండేది. ఉద్యోగాలు లేవు. చదువుకునే మహిళలకు కకనీసం ఫ్రీ చదువులు లేవు. విద్యా రుణాలు తీసుకుంటే కనీసం వడ్డీ మాఫీ గురించి కూడా ఆలోచన చేయడం లేదు. అలాచేసివుంటే బేటీపడావో..బేటీ బచావోకు అర్థం ఉండేది. ఆర్థిక మంత్రిగా ఓ మహిళ ఉన్నా మహిళలకు ప్రత్యేకంగా ఒనగూరుతున్న ప్రయోజనం లేదు. తక్షణం మహిళలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించడంలో అధికార విపక్ష సభ్యులు ఉమ్మడిగా విఫలం అయ్యారు. బిల్లును పాస్ చేసినా అమలు కాకుండా అటకెక్కించారు. ఈ బిల్లుతో రాజకీయ లబ్ది పొందానలన్న బిజెపి ఎత్తుగడ మాత్రం ఫలించింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవాలు ఇలా ఏటేటా జరుపుకుంటున్నా...మన నేతల్లో మార్పు రావడం లేదు. చట్టసభల్లో వారికి రావాల్సిన వాటాను కావాలనే ఇంతకాలం అడ్డుకున్నారు. సమాజంలో మహిళలకు ఉన్న అత్యుతన్నస్థాయి గౌరవాన్ని మనమే దిగజార్చుకుంటున్నా పెద్దగా భయపడడం లేదు. చట్టసభల్లో కనీసం వారి అభిప్రాయా లకు విలువను ఇచ్చినట్లుగా ఉంటే బాగుండేది. కానీ అలా జరగడంలేదు. కేవలం వారికి శుభాకాంక్షలు చెప్పడంతో బడానేతలు తప్పించుకుంటున్నారు. తమ ధర్మాన్ని విస్మరించారు. సమాజం కూడా వారిని ఇంకా విలాసవస్తువుగానే చూస్తున్నది.. అమ్మాయి కనిపిస్తే అత్యాచారం చేయడమే లక్ష్యంగా మృగాళ్లు చెలరేగి పోతున్నారు. వారి గౌరవానికి భంగం కలిగించే అంశాలపై యుద్ధం చేయాలి. పురుషాహంకార సమాజాన్ని నిలదీయాలి. నిగ్గదీయాలి. తమ హక్కులను సాధించే వరకు పోరాటాన్ని కొనసాగించాలి.

భారత రాజకీయాల్లో మహిళలు కీలక భూమిక పోషిస్తున్నా తగినంతగా ప్రోత్సాహం మాత్రం దక్కడం లేదు. అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలను ఎందుకనో రాజకీయంగా ముందుకు సాకుండా అణగ దొక్కుతున్నారు. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ కారణంగా ఎందరో మహిళలు తమ సత్తా చాటుతున్నారు. అసెంబ్లీ,పార్లమెంటుల్లో మాత్రం రిజర్వేషన్ల దక్కితేనే మరింతగా రాణిస్తారు. వారిని అణచి వేయడం వల్ల 50శాతం జనాభా ఆకాంక్షలను కాలరాస్తున్న వారం అవుతున్నాం. మహిళా సాధికారతతో ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యంగా పాలన సాగాలి. అన్నిరంగాల్లో మహిళలకు సముచిత భాగస్వామ్యం కల్పించి నప్పుడే సామాజిక ప్రగతి సాధ్యపడుతుంది. అలాగే చదువుకునే అమ్మాయిలకు ఉచిత విద్యా రుణాలు అందాలి. అలాగే వారి ఉన్నత విద్యకు ప్రభుత్వాలు చేయూత నివ్వాలి. బేటీపడావో . . బేటీ బచావో నినాదం కార్యరూపం దాల్చాలి. మహిళలను విలాసవస్తువుగా చూసే సంస్కృతిపై కఠినంగా వ్యవహరించాలి. అత్యాచారాలు, వేధింపులపై కఠినంగా వ్యవహరించేలా చట్టాలు రావాలి. ప్రజాస్వామ్యంలో కేవలం అధికార పక్షమే కాదు ప్రతిపక్షాలకూ, ప్రజలందరికీ పాత్ర ఉంటుంది. ఇది గమనించి అందరూ ముందుకు సాగాలి. మహిళల గొప్పతనాన్ని భారతీయ మహిళల ఆదర్శాలను ప్రముఖంగా ప్రస్తావించిన మన సంస్కృతిని ముందుకు తీసుకుని వెళ్లే క్రమంలో సమాజం వారిపట్ల గౌరవభావంతో సాగాలి. విద్య,క్రీడా, సాంస్కృతిక రంగాల్లో వారిని ముందుకు నడిపించేలా నిర్ణయాలు తీసుకుని ముందుకు సాగాలి. అప్పుడే మనం ఆశించిన మహిళాభ్యుదయం సాకారం అవుతుంది. అలాగే మహిళల పట్ల అకృత్యాలకు పాల్పడే మృగాళ్లను కఠినంగా శిక్షించాలి. అవసరమైతే ఉరిశిక్షలకు కూడా వెనకాడరాదు. వరకట్న వేధింపులు వంటివి లేకుండా చూడాలి. పనిప్రదేశాల్లో రోణ కల్పించాలి. ఇవన్నీ కూడా అమలుకు కఠిన చట్టాలే శరణ్యం.

# లింగ వివక్షకు దూరంగా మహిళ

### వారిని సమానంగా ముందుకు నడిపించాలి

### లింగవివక్ష లేని సమాజమే లక్ష్యం !




**న్యూఢిల్లీ,మార్చి7 :** 1975వ సంవత్సరం నుంచి అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఐక్యరాజ్య సమితి అధికారికంగా నిర్వహించటం ప్రారంభించింది. అంతేకాదు, ప్రతి ఏటా ఏదో ఒక ఇతివృత్తం అంటే థీమ్‌తో ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. అంతర్జాతీయ మహిళా సమానత్వం 2025 థీమ్‌గా నిర్ణయించారు. అంటే లింగ వివక్ష లేకుండా ముందుకు సాగడం అన్నది ఈయేటి సంకల్పంగా ప్రకటించారు... స్త్రీలు సాధికారత పొందాలంటే వారి ఆకాంక్షలకు సమాజం ఆమోదం తెలపాల్సిందే. ఒక స్త్రీ అంటప్రెన్యూర్ కావాలనుకున్నా, పెద్ద పెద్ద సంస్థల్లో నాయకత్వ స్థానానికి ఎదగాలనుకున్నా, కాన్పు సమయంలో బ్రేక్ తీసుకుని నాలుగైదేళ్ల తర్వాత తిరిగి తన ఉద్యోగం చేయాలని అనుకున్నా, పెళ్లి తర్వాత పై చదువులకు వెళ్లాలనుకున్నా, గృహిణిగా ఉంటూ ఇంటిపట్టునే ఏదైనా పనిచేసి సంపాదించాల నుకున్నా వారికి అడ్డుగా నిలవకపోవడమే చేయవలసింది. ఒక అధ్యయనం ప్రకారం స్త్రీలు తమ సంపాదనలో 90 శాతం కుటుంబం కోసం ఖర్చు పెడతారు. పురుషులు నలభై,యాభై శాతం ఖర్చు పెడతారు. స్త్రీలు సాధికారత పొందడం అంటే తాము ఏం చేసినా పడి ఉంటుందనే భావన నుంచి పురుషులను బయట పడేయడం అని అర్థం చేసుకోవాలి.అభివృద్ధి విధాన రూపకల్పనకు సంబంధించి నిర్ణయం తీసుకునే పక్రియలో మహిళలను ఆర్థికంగా భాగస్వాములుగా ఎలా చేయవచ్చో థీమ్ హైలైట్ చేస్తుంది. భవిష్యత్ వైపు అడుగులు వేయాలంటే మహిళలను ముందుకు తీసుకుని వెళ్లడంతో పాటు, లింగవివక్ష లేకుండా చేయాలి. యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతా ....అన్న ఆర్యోక్తిని మననం చేసుకోవడం నిరంతరంగా సాగాలి. ఎక్కడ స్త్రీలు గౌరవించబడతారో అక్కడ దేవతలు పూజలందుకొంటారు. ఎక్కడ స్త్రీలు గౌరవించబడరో అక్కడ ఎంత గొప్ప సత్కార్యాలైననూ ఫలించవు అని మన సంస్కృతి తెలుపుతుంది. ఎక్కడ స్త్రీలు గౌరవింపబడతారో, ఎక్కడ స్త్రీలను దేవతగా భావించి పూజి స్తారో, అక్కడ సర్వసంపదలూ ఉండడమే కాక రథ, గజ, తురగ పదాదులతో కూడిన లక్ష్మీ దేవి అచంచలయై నిలబడుతుంది. విప్లవాత్మక మార్పుల కోసం అడుగు వేయాలని తెలిపింది. మహిళల పురోగతిని నిరోధించే సాంస్కృతిక, చారిత్రక, సామాజిక ఆర్థిక అవరోధాల అడ్డును తొలగించాలనేది ఈ థీమ్ ముఖ్య ఉద్దేశ్యం.స్త్రీలు సాధికారత, ఆర్థిక స్వావలంబన పొందాలంటే ఆర్థిక అక్షరాస్యత కలిగి ఉండాలి. ముఖ్యంగా దిగువ, మధ్యతరగతి స్త్రీలకు ఆర్థిక అక్షరాస్యతను కలిగించాలి. వ్యక్తిగత ఖర్చులు, కుటుంబ బడ్జెట్, పొదుపు, ఆదాయం తెచ్చే పెట్టుబడి... వీటి గురించి అవగాహన ఉండాలి. 'మీ జీవితం మీ చేతుల్లో ఉండాలంటే' మీ దగ్గర ఎంత డబ్బు ఉండాలి... అందుకు ఏమి చేయాలో తెలుసుకోవాలి. సొంత ఆస్తి, స్వీయపేరు మీద పాలసీలు, ఫిక్స్‌డ్ డిపాజిట్‌లు, షేర్లు, ఎమర్జన్సీ ఫండ్ కలిగి ఉండటం, డిజిటల్ పరిజ్ఞానం పొంది ఉండటం? అంటే ఆర్థిక లావాదేవీలు ఫోన్‌మీద, కంప్యూటర్ మీద చేయగలిగి వేగంగా పనులు నిర్వర్తించ గలగడం.

కుటుంబ సౌభాగ్యమే దేశ సౌభాగ్యం అనుకుంటే కుటుంబంలో కీలకమైన వాటాదారైన స్త్రీ ఎంత ఆర్థిక సమృద్ధితో ఉంటే దేశ సమృద్ధి అంతగా పెరుగుతుంది. ఉమెన్స్ డే సందేశం అదే. స్త్రీలు సాధికారత ఎప్పుడు పొందుతారంటే ఆర్థికంగా వారు స్వేచ్ఛ పొందినప్పుడు. స్త్రీలకు సామాజికంగా, కుటుంబ పరంగా హక్కులు ఉంటాయి. అయితే ఆ హక్కులను దక్కించు కోవాలంటే వారికి ఆర్థిక ఆత్మవిశ్వాసం ఉండాలి.'ఎవరో ఒక అయ్య చేతిలో పెట్టడానికి' అనుకునే తల్లిదండ్రులు, భర్త సంపాదన వల్ల మాత్రమే ఆమె బతకాలనుకునే తల్లిదండ్రులు ఆమె చదువును నిర్లక్ష్యం చేయడం గ్రామీణ భారతంలో నేటికీ జరుగుతూనే ఉంది. ఆడపిల్లకు ఆస్తిపాస్తులు ఇచ్చినా చదువు వల్ల వచ్చే, ఆమెకై ఎంచుకునే ఉపాధి నుంచి వచ్చే సంపాదన కలిగించే ఆత్మవిశ్వాసం వేరు. స్త్రీలను 'అదుపులో ఉంచడం' అంటే వారిని ఆర్థిక వనరుల నుంచి దూరంగా పెట్టడమే. కుటుంబపరంగా, సామాజికంగా తన జీవితం ఏ విధంగా గడవాలని స్త్రీ ఆశిస్తుందో ఆ నిర్ణయాన్ని వెల్లడించే శక్తి ఆర్థిక స్వావలంబన వల్ల కలుగుతుంది.

# నాసా వ్యోమగాములను భూమ్మీదకు తీసుకు వస్తాం

### మస్క్‌కు బాధ్యత అప్పగించానన్న ట్రంప్



**వాషింగ్టన్,మార్చి 7 :** నాసా వ్యోమగాములు సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్‌లను త్వరలో భూమి మీదకి తీసుకువస్తామని అమెరికా అధ్యక్షులు ట్రంప్ ప్రకటించారు. వ్యోమగాములు సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్‌లు 9 నెలలుగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లో చిక్కుకుపోయిన సంగతి తెలిసిందే. ఆ ఇద్దరు వ్యోమగాములు తిరిగి వచ్చినపుడు, వారిని పలకరించడానికి తాను సిద్ధంగా ఉంటానని ట్రంప్ అన్నారు. ఓవల్ ఆఫీసులో గురువారం కీలక ప్రకటన చేశారు. 'మేము మిమ్మల్ని ప్రేమిస్తున్నాం. తీసుకువెళ్లడానికి వస్తున్నాం' అని వ్యోమగాములకు సందేశం పంపామని అన్నారు. వారిని భూమిపైకి తీసుకువచ్చేందుకు బైడెన్ ప్రభుత్వం ఎలాంటి ప్రయత్నం చేయలేదని మండిపడ్డారు. వ్యోమగాములను సురక్షితంగా భూమిపైకి తీసుకువచ్చే బాధ్యతను ఎలన్ మస్క్‌కు అప్పగించినట్లు తెలిపారు. రాబోయే రెండువారాల్లో మస్క్ వ్యోమగాములను తిరిగి భూమిపైకి తీసుకువచ్చే స్పేస్ ఎక్స్ క్యాప్సూల్‌ను సిద్ధం చేస్తున్నారని అన్నారు.

# బిజెపిలో మహిళలకు సముచిత గౌరవం

### సిఎం పదవి అలా వచ్చిందేనన్న రేఖాగుప్తా

**న్యూఢిల్లీ,మార్చి7 :** బిజెపిలో మహిళలకు సముచిత గౌరవం ఉంటుందని, సిఎం పదవి తనకు అలా వచ్చిందేనన ఢిల్లీ సిఎం రేఖాగుప్తా అన్నారు. అందుకు తానెంతో గర్విస్తున్నానని అన్నారు. అనుభవం లేకపోయినా ఒకేసారి ఉన్నత పదవిని చేపట్టడం ఎలా ఉందని దిల్లీ సీఎం రేఖా గుప్తా కు ప్రశ్న ఎదురైంది. ఓ జాతీయమీడియా సంస్థతో మాట్లాడుతూ దానికి ఆమె తనదైన శైలిలో సమాధానం ఇచ్చారు. ఉర్దూ కవి రహత్ ఇందోరి రాసిన షాయరీని ప్రస్తావించారు. 'నేను కొమ్మల నుంచి రాలిపోయే ఆకును కాను.. ఎవరైనా ఆ తుపానుకు కాస్త చెప్పండి.. అదుపులో ఉండమని' అంటూ బదులిచ్చారు. 'ముఖ్యమంత్రిని కావడం నా కల కాదు. నా దారిలో నేను పని చేసుకుంటూ ముందుకెళ్లాను. ఈ పదవి లాటరీ కాదు. మన దేశంలో మహిళలపై ఉన్న గౌరవానికి ఇది చిహ్నం. మహిళలకు గుర్తింపు ఇవ్వాలనే సిద్ధాంతంతో సీఎంగా నన్ను నియమించినందుకు ప్రధాని మోదీ, పార్టీ నేతలకు కృతజ్ఞతలు. ఈ నిర్ణయం దేశ మహిళలకు మంచి సందేశాన్ని ఇస్తుంది' అని గుప్తా వెల్లడించారు. గత ప్రభుత్వాల పాలనలోని లోపాలను సరిదిద్దేందుకు, అవినీతిని పారదోలేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల విజయంతో రేఖా గుప్తా దిల్లీ సీఎంగా నియమితులయ్యారు. తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన ఆమెకు ఈ అవకాశం దక్కింది. సీఎంగా ఎన్నికైన వెంటనే ఆప్ విమర్శలు చేయడంతో ఆమె దీటుగా బదులిచ్చిన సంగతి తెలిసిందే. భాజపా ఎన్నికల వాగ్దానాలను నెరవేర్చలేదంటూ దిల్లీ మాజీ సీఎం ఆతిశీ చేసిన విమర్శలను రేఖా గుప్తా (ఖీ।÷ఖరజీ ఉబూబిజీ) తిప్పికొట్టారు. 'కాంగ్రెస్ 15 ఏళ్లు, ఆప్ 13 ఏళ్లు దిల్లీని పాలించాయి. ఇన్నేళ్లపాటు మీరేం చేశారో చూసుకోకుండా.. అధికారంలోకి వచ్చి ఒక్కరోజు కూడా కానీ మాపై విమర్శలు చేస్తారా..?' అని దీటుగా బదులిచ్చారు.

# పునర్విభజన పోరాటం కోసం జెఎసి

### తమిళనాడు సిఎం స్టాలిన్ చొరవ

### వివిధ రాష్ట్రాల సిఎంలకు లేఖలు రాసిన స్టాలిన్

**న్యూఢిల్లీ,మార్చి7 :** వచ్చే ఏడాది లోక్‌సభ పునర్విభజన జరగనున్న వేళ తమిళనాడు సీఎం, డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్ కీలక నిర్ణయం తీసుకున్నారు. అందులో భాగంగా నియోజకవర్గాల పునర్విభజనపై జేఏసీ ఏర్పాటు చేయాలని ఆయన భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ అంశంపై వివిధ రాష్ట్ర ముఖ్యమంత్రులు, మాజీ సీఎంలకు సీఎం స్టాలిన్ శుక్రవారం లేఖ రాశారు. ఈ జేఏసీలో తమ పార్టీ అభ్యర్థులను సూచించాలని ఆ లేఖలో సీఎంలు, మాజీ సీఎంలకు ఆయన సూచించారు. అలాగే మార్చి 22 వ తేదీ చెన్నయిలో ఈ జేఏసీ తొలి సమావేశం జరగనుందని ఆ లేఖలో సీఎం స్టాలిన్ స్పష్టం చేశారు. అదే విధంగా ఈ సమావేశానికి హాజరు కావాలని ఆ లేఖలో వారికి సీఎం స్టాలిన్ విజ్ఞప్తి చేశారు. ఏపీ, తెలంగాణ, కేరళ, కర్నాటక, పశ్చిమబెంగాల్, పంజాబ్ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మాజీ ముఖ్యమంత్రులకు ఆయన ఈ లేఖలు రాశారు. ÷రిళిక్‌సభ స్థానాల పునర్విభజనతో దక్షిణాదిలో ఆ స్థానాల సంఖ్య తగ్గనున్నాయని.. అలాగే ఉత్తరాదిలో వాటి సంఖ్య గణనీయంగా పెరగనున్నాయంటూ ఓ ప్రచారం అయితే వాడి వేడిగా సాగుతోంది. ఈ నేపథ్యంలో తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. మరోవైపు తమిళనాడులో ప్రస్తుతం 39 లోక్‌సభ స్థానాలు ఉన్నాయని.. పునర్విభజన అనంతరం వాటి సంఖ్య 31కి చేరుతోందంటూ సీఎం స్టాలిన్ ఇటీవల సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆ క్రమంలో తమిళనాడు 8 లోక్ స్థానా లను0 కొల్పోనుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అందులో భాగంగా మార్చి తొలి వారంలో ఈ అంశంపై చర్చించేందుకు చెన్నయిలో అఖిల పక్ష సమావేశాన్ని ఆయన ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి అన్ని రాజకీయ పార్టీలు హాజరయ్యాయి. కానీ బీజేపీ మాత్రం ఈ సమావేశానికి డుమ్మా కొట్టిన విషయం విదితమే. మరోవైపు సీఎం స్టాలిన్ చేసిన ఈ కీలక వ్యాఖ్యల నేపథ్యంలో ఆ మరునాడే కోయంబత్తురు పర్యటనకు వచ్చిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా స్పందించారు. పునర్విభజన అనంతరం దేశంలోని దక్షిణాది రాష్ట్రాల్లో లోక్ సభ స్థానాల సంఖ్య తగ్గించే ప్రయత్నం అయితే ఏమీ జరగదని ఆయన కుండబద్దలు కొట్టారు. అంతేకాదు.. ప్రధాని మోదీ సైతం ఇదే అంశాన్ని పార్లమెంట్ సాక్షిగా ప్రకటన చేశారని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. అదీకాక మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాలంటూ విభజించే ప్రయత్నం చేస్తుందంటూ గత కొద్ది రోజులుగా ఓ వాదన సాగుతోంది. అంతేకా కుండా.. ఉత్తరాదిలో లోక్ సభ స్థానాలను పెంచడం ద్వారా.. దక్షిణాది రాష్ట్రాల ప్రాధాన్యతను తగ్గించే ప్రయత్నం చేస్తుందనే విమర్శలు సైతం వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ ఈ కీలక నిర్ణయం తీసుకున్నారనే ఓ చర్చ అయితే సాగుతోంది.

# ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలు

### జనసేన తరపున నాగబాబు నామినేషన్

### నాగబాబు అభ్యర్థిత్వాన్ని సమర్థించిన లోకేశ్



**అమరావతి,మార్చి 7 :** ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీ అభ్యర్థిగా జనసేన ప్రధాన కార్యదర్శి, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సోదరుడు నాగబాబు నామినేషన్ దాఖలు చేశారు. నాగబాబు అభ్యర్థిత్వాన్ని మంత్రి నారా లోకేశ్, బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు బలపరిచారు. రిటర్నింగ్ అధికారిణి వనితా రాణికి నాగబాబు తన నామినేషన్ పత్రాలు సమర్పించారు. నామినేషన్ కార్యక్రమంలో మంత్రి నాదెండ్ల మనోహర్ సహా ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, బొలిశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు. నాగబాబు అభ్యర్థిత్వాన్ని ప్రతిపాదిస్తూ జనసేన పార్టీకి చెందిన 10 మంది ఎమ్మెల్యేలు సంతకాలు చేశారు. మంత్రి నాదెండ్ల మనోహర్ స్వయంగా ఈ బాధ్యతను తీసుకొన్నారు. ఎమ్మెల్యేలు మండలి బుద్ధ ప్రసాద్, ఆరణి శ్రీనివాసులు, లోకం నాగ మాధవి, పంచకర్ల రమేష్ బాబు, పత్సమట్ల ధర్మరాజు, సుందరపు విజయ్ కుమార్, అరవ శ్రీధర్, పంతం నానాజీ, బత్తుల బలరామకృష్ణలు సంతకాలు చేశారు. ఎమ్మెల్యేలతో పాటు మంత్రి నాదెండ్ల మనోహర్ కూడా సంతకం చేశారు. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నిక నామినేషన్‌లకు మార్చి 10 చివరి గడువు. ప్రభుత్వ సెలవు రోజులు మినహాయించి.. మిగిలిన ఏ రోజైనా ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ శాసనసభ భవనంలో నామినేషన్‌లను స్వీకరిస్తారు. మార్చి 11న ఉదయం 11 గంటలకు నామినేషన్‌ల పరిశీలన, మార్చి 13న మధ్యాహ్నం 3 గంటల్లోపు ఉపసంహరణకు అవకాశం ఉంటుంది.

# మండలంలో మాజీ ఎమ్మెల్యే రసమయి పరామర్శలు



జనత న్యూస్ బెజ్జంకి : బెజ్జంకి మండల పర్యటనలో భాగంగా మానకొండూరు మాజీ శాసనసభ్యులు డాక్టర్ రసమయి బాలకిషన్ శుక్రవారం బేగంపేట గ్రామంలో పత్రి రవి తల్లి ఇటీవల మరణించడంతో ఆయనతోపాటు అతని కుటుంబ సభ్యులను ఓదార్చి వారికి మనోధైర్యం ఇచ్చారు. అలాగే గుగ్గిళ్ళ మాజీ సర్పంచ్ నాగభూషణం ఇటీవల ఆరోగ్యానికి గురి కావడంతో ఆయనను పరామర్శించి , అనారోగ్యానికి గల కారణాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పాకాల మైపాల్ రెడ్డి , బేగంపేట తాజా మాజీ సర్పంచ్ చింతలపెల్లి సంజీవరెడ్డి, నాయకులు లింగాల లక్ష్మణ్, కనగండ్ల తిరుపతి, దీటి రాజు, ఎలా శేఖర్ బాబు, బెజ్జంకి పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఓ లక్ష్యం ఉండాలి

**నారోజు శంకరాచారి.**




జనత న్యూస్ బెజ్జంకి : బెజ్జంకి మండలంలోని ఆదర్శ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన కెరీర్ గైడెన్స్ పై అవగాహన కార్యక్రమంలో సివిల్స్ మార్గ నిర్దేశకులు "నా గమ్యం ఐఏఎస్" పుస్తక రచయిత నారోజు శంకరాచారి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ప్రతి విద్యార్థి తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకోవాలని, ఆ లక్ష్యం వైపు గమ్యం చేరేవరకు నిరంతరం పోరాటం చేయాలని, ఉన్నత ఉద్యోగాలు సాధించి పేదరికాన్ని జయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ సంగీత , పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు.

# బెదరకోటకు పదోన్నతి

## ఏ ఎస్ పి నుండి ఎస్పీగా పదోన్నతి పొందిన జనార్ధన్

## హుజురాబాద్ లో హర్షాతిరేకాలు

(కోరెం సుధాకర్ రెడ్డి, జనతా న్యూస్ ప్రతినిధి హుజురాబాద్)

హుజురాబాద్ పట్టణానికి చెందిన బెదరకోట జనార్ధన్ పోలీసు శాఖలో ఎస్సై స్థాయి నుండి అంచెలంచెలుగా ఎదిగి ప్రస్తుతం ఎస్పీగా పదోన్నతి పొందారు. ట్రాన్స్కో లో విజిలెన్స్ విభాగంలో ఏఎస్పి స్థాయిలో పనిచేస్తున్న జనార్ధన్ కు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ గా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయనకు వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో డీసీపీ క్రైమ్ గా నియమించింది. జనార్ధన్ హుజురాబాద్ కు చెందిన పూర్వ విద్యార్థి. ఆయన స్వగ్రామం సైదాపూర్. హుజురాబాద్ లో ఆయనకు చాలామంది మిత్రులు ఉన్నారు. పోలీసు శాఖలో నీతి నిజాయితీ గల అధికారిగా పేరు తెచ్చుకున్నారు. ఆయన తరచుగా హుజరాబాద్ లో జరిగే కార్యక్రమాలకు హాజరవుతుంటారు. బెదరకోట జనార్ధన్ ఎస్ఐ స్థాయి నుండి, సిఐగా, ఏసీపీగా, డిసిపిగా ప్రమోషన్లు వచ్చాయి. తాజాగా ఎస్పీగా కూడా ప్రమోషన్ అందుకోవడం పట్ల హర్షం వ్యక్తం అవుతుంది. పోలీసు శాఖలో తన పనితీరుతో అంచెలంచెలుగా ఎదిగిన జనార్దన్ ను హుజురాబాద్ వాసులు అభినందిస్తున్నారు. ఎస్పీగా పదోన్నతి పొందిన జనార్ధన్ ను.. విశ్రాంత ఎంపీడీవో కొత్త అశోక్ రెడ్డి, తెలంగాణ టుడే ఎడిటర్ కూతురు శ్రీనివాస్ రెడ్డి, గౌరిశెట్టి సోమేశ్వర్, అజేంద్ర కుమార్ రాథోడ్, గోలి శ్రీనివాస్, కూతురు విద్వాన్ రెడ్డి, కొండ గణేష్, అనగోని సదానందం, విశ్రాంత సోషల్ వెల్ఫేర్ అధికారి మంగళ హనుమంతు గౌడ్, ఆల్ ఇండియా రేడియో దూరదర్శన్ పాత్రికేయులు పాములపర్తి మదన్మోహన్రావు, కరాటే రమేష్, నరేష్ తదితరులు ప్రత్యేకంగా అభినందించారు.



# కేంద్రమంత్రి బండి సంజయ్‌కి ధన్యవాదాలు

## కిషన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కరివేద మహిపాల్ రెడ్డి

జనత న్యూస్ బెజ్జంకి : మండలంలోని దేవక్కపల్లి గ్రామంలో గల వన దేవతలైన సమ్మక్క – సారక్క జాతర మార్గం వెళ్లే దారికి సిసి రోడ్డు నిర్మాణానికి కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ 10 లక్షల కేంద్ర ప్రభుత్వ ఈజీఎస్ నిధులు మంజూరు చేయడం సంతోషించదగ్గ విషయమని, దేవక్కపల్లి గ్రామ ప్రజల తరఫున కేంద్రమంత్రికి ధన్యవాదాలు తెలుపుతున్నట్లు మాజీ సర్పంచ్ కరివేద విజయలక్ష్మి మైపాల్ రెడ్డి మరియు సమ్మక్క సారలమ్మల జాతర కమిటీ చైర్మన్ జంగిడి సంజీవరెడ్డి శుక్రవారం విడుదల చేసిన పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా కిషన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కర్వేద మైపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి జరిగే సమ్మక్క సారలమ్మ జాతరకు మండలంలోని వివిధ గ్రామాల ప్రజలతోపాటు, అనేక ప్రాంతాల నుండి ప్రజలు హాజరవుతారని, జాతర వద్దకు వెళ్లే రోడ్డు మార్గం అస్తవ్యస్తంగా ఉండడంతో కేంద్ర సహాయమాత్రికి విన్నవించడంతో తక్షణం స్పందించి నిధులు మంజూరు చేశారని, భూమి పూజ కార్యక్రమం ముఖ్యఅతిథి సొల్లు అజయ్ వర్మ, విశిష్ట అతిథి బోయినపల్లి శ్రీనివాసరావు ల చేతుల మీదుగా నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ మండల అధ్యక్షులు కొలిపాక రాజు, నాయకులు సంగ రవి, సాన వేణు, బుర్ర కిషన్, దారం సతీష్ రెడ్డి, బూత్ అధ్యక్షులు జంగిడి కమలాకర్ రెడ్డి, బాల్ రెడ్డి, బీరం చంద్రారెడ్డి, ఎల్లయ్య, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



# జగన్మోహినీ అలంకారంలో యాదాద్రీశుడు

**యాదగిరిగుట్ట, జనత న్యూస్ :** బ్రహ్మోత్సవాలలో భాగంగా ఏడో రోజు ఉదయం నిత్యారాధనల అనంతరం.. ప్రధానాలయంలో పారాయణికుల వేదపారాయణాలు, యజ్ఞాచార్యుల మూలమంత్ర, మూర్తిమంత్ర జపాల నడుమ జగన్మోహినీ అలంకార సేవను ఆలయ అర్చకులు నేత్రపర్వంగా నిర్వహించారు. భూదేవీ సమేతుడైన నారసింహుడిని ఆలయ మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను పరవశుల్ని చేశారు. జగన్మోహినీ అవతారంలో స్వామివారు దుష్టశిక్షణ, శిష్ట రక్షణ చేశాడని భక్తులకు అర్చకులు ఉపదేశించారు.



**నేడు లక్ష్మీనారసింహుడి కల్యాణం**

బ్రహ్మోత్సవాలలో భాగంగా ప్రధాన ఘట్టమైన లక్ష్మీనరసింహుడి తిరుకల్యాణానికి సర్వం సిద్ధమైంది. శనివారం రాత్రి 8:45 గంటలకు లక్ష్మీనరసింహుల తిరుకల్యాణ మహోత్సవం జరగనుంది. మొదటగా శనివారం ఉదయం 9 గంటలకు శ్రీరామ అలంకారంలో హనుంత వాహనంపై స్వామివారిని ఊరేగించనున్నారు. తర్వాత రాత్రి 8:45 గంటలకు గజవాహనంపై ఆలయ మాడవీధుల్లో విహరింపజేసిన అనంతరం.. స్వామివారి తిరుకల్యాణ మహోత్సవాన్ని ఆరంభించనున్నారు. ఇక తిరుకల్యాణ మహోత్సవం సందర్భంగా.. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించనున్నారు. మంత్రితో పాటు ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య కూడా పాల్గొననున్నారు.

**నారసింహుడి కల్యాణానికి ముమ్మర ఏర్పాట్లు**

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి నిర్వహించే కల్యాణానికి కావాల్సిన అన్ని ఏర్పాట్లను ఆలయ అధికారులు ముమ్మరం చేశారు. స్వామివారి కల్యాణాన్ని ప్రధానాలయానికి ఉత్తరం వైపున నిర్వహించడం కోసం ప్రత్యేక మండపాన్ని ఏర్పాటు చేశారు. గతంలో ప్లేస్ సరిపోక భక్తుల పడ్డ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఏర్పాట్లను పకడ్బందీగా చేశారు. ఆలయానికి ఉత్తరం వైపున విశాలమైన స్థలంలో స్వామివారి తిరుకల్యాణం నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. దాదాపుగా 3000 మంది భక్తులు కల్యాణాన్ని వీక్షించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. వీవీఐపీలు, వీఐపీలు, ప్రెస్, కల్యాణ భక్తులు, దోనర్లు, సాధారణ భక్తుల కోసం వేర్వేరుగా గ్యాలరీలు ఏర్పాటు చేస్తున్నారు. వీఐపీల వల్ల సామాన్య భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటూ ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక కల్యాణంలో పాల్గొనే భక్తుల కోసం కల్యాణం టికెట్లను ఆన్ లైన్, ఆఫ్ లైన్ లో అందుబాటులో ఉంచారు. కల్యాణ టికెట్ ధర రూ.3000 కాగా.. ఒక్క టికెట్ పై దంపతులిద్దరిని మాత్రమే అనుమతించనున్నారు.

# ప్రణాళికతో చదవండి.. మంచి మార్కులు సాధించండి



## యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతరావు

**యాదగిరిగుట్ట,** విద్యార్థులు సరైన ప్రణాళికతో కష్టపడి చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతరావు సూచించారు. మోటకొండూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. మధ్యాహ్న భోజన తయారీని పరిశీలించి విద్యార్థులకు స్వయంగా భోజనం పెట్టారు. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేకంగా పాఠాలు చెప్పి ప్రీఫైనల్ పరీక్షలు ఎలా రాస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. అనంతరం హెచ్ఎం, స్కూల్ టీచర్లతో కలిసి రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని స్కూల్ స్టాఫ్ ను ఆదేశించారు. విద్యను అభ్యసించడానికి అవసరమైన అన్ని సదుపాయాలు, సౌకర్యాలు కల్పించాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పేషెంట్లతో మాట్లాడి వసతులు ఎలా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు ఓపీకి ఎంతమంది పేషెంట్లు వస్తున్నారని ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హాస్పిటల్ పరిసరాలు శుభ్రంగా ఉండేలా శానిటేషన్ నిరంతరంగా ఉండాలని, అలాగే హాస్పిటల్ సిబ్బంది సమయపాలన పాటించాలని ఆదేశించారు. ప్రభుత్వ హాస్పిటళ్లలో అన్ని రకాల సదుపాయాలు, సౌకర్యాలు ఉన్నాయని, ప్రైవేట్ హాస్పిటళ్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ వెళ్లొద్దని ప్రజలకు సూచించారు.

# ఎన్నికల్లో ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నాం

**ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య**



యాదగిరిగుట్ట : ఎన్నికల్లో ప్రజలకిచ్చిన మాట నిలబెట్టుకున్నామని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే శ్రీ బీర్ల అయిలయ్య గారు సంతోషం వ్యక్తం చేసారు. తెలంగాణ రాష్ట్ర కేబి నెట్ సమావేశంలో గంధమల్ల రిజర్వాయర్ నిర్మాణం 1.41 టీఎంసీలుగా ఆమోదం తెలిపిందన్నారు..నియోజకవర్గ ప్రజల,గంధమల్ల గ్రామ ప్రజల తరపున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి, భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గార్లకు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య గారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తుర్కపల్లి మండలం గంధమల్ల జలాశయం నిర్మాణానికి ప్రభుత్వం పచ్చజెండా ఊపింది.గురువారం జరిగిన మంత్రి మండలి సమావేశంలో జలాశయం నిర్మాణానికి ఆమోదం తెలిపింది. దీంతో ఆలేరు నియోజకవర్గంలో సాగు, తాగునీటి కష్టాలు తొలగి పోనున్నాయి.కరవు నుంచి ఆలేరు నియోజకవర్గంలోని పలు మండలాలు విముక్తి కానున్నాయి. కాగా గత అసెంబ్లీ సమావేశాలలో పలు నియోజకవర్గంలో జరిగిన సమావేశంలో 1.టి.ఎం.సికి రిజర్వాయర్ సామర్థ్యాన్ని తగ్గించాలని ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే శ్రీ బీర్ల అయిలయ్య గారు అనేక సార్లు ప్రభుత్వానికి విన్నవించుకున్నారు.అదేవిధంగా గత ఏడాది ఆగస్టు 30న భువనగిరిలో జరిగిన పార్లమెంట్ స్థాయీ సమీక్ష సమావేశంలో గంధమల్ల రిజర్వాయర్ ను మంజూరు చేస్తు న్నట్లు భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమకుమార్ రెడ్డి వెల్లడించారు. ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వ ఆమో దానికి పంపారు. 1.41 టీఎంసీల సామర్థ్యంతో ఈ జలాశయ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు.

## శీష్ మహల్‌లో కూర్చొని పనిచేసే సీఎంను కాను : రేఖా గుప్తా



**న్యూఢిల్లీ :** దేశ రాజధానిలో ఓ మీడియా సంస్థ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వంపై మండిపడ్డారు. ఆమ్‌ఆద్మీ పార్టీ అధికారంలో ఉన్నంత కాలం దేశరాజధాని ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ప్రజల గురించి ఆలోచించకుండా శీష్ మహల్ నిర్మించుకోవడంలో బిజీగా ఉన్నట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయనలా తాను శీష్ మహల్‌లో కూర్చొని పని చేసే సీఎంను కానన్నారు. 24గంటలు ప్రజల మధ్యే ఉంటూ వారి కోసం పని చేసే ముఖ్యమ ంత్రినని అన్నారు. ఢిల్లీలో మహిళను సీఎంను చేయడంతో సులభంగా అధికారం తమ చేతిలో పెట్టుకోవచ్చని భాజపా నేతలు ఈ పదవిని కట్టబెట్టారని వస్తున్న వార్తలపై ఆమె బదులిచ్చారు. మహిళలపై భాజపాకు ఉన్న గౌరవంతోనే దేశరాజధానికి తనను సీఎంగా నియమించారని అన్నారు. ముఖ్యమంత్రి పదవిలో ఉన్న తనను కేవలం ప్రజలు మాత్రమే నియంత్రించగలరన్నారు. పార్టీ నేతలు కేవలం తనకు కావాల్సిన సహాయ సహకారాలు అందిస్తారే తప్ప అధికారం తమ గుప్పిట్లో పెట్టుకోవాలనే ఆలోచన వారికి ఉండదని చెప్పారు. తామంతా ప్రధాని మోదీ ఆధ్వర్యంలో కలిసికట్టుగా దేశరాజధానిని అభివృద్ధి బాటలో నడుపుతామని విశ్వాసం వ్యక్తం చేశారు. "అధికారం చేపట్టిన మొదటి రోజే శీష్ మహల్‌లో ఉండబోనని చెప్పాను. ప్రజలు కష్టపడి సంపాదించుకున్న డబ్బును విశ్రాంతి, సౌకర్యం కోసం ఉపయోగించుకునే హక్కు నాకు లేదు. ఆ ఆస్తి ఢిల్లీ ప్రజలది" అని రేఖా గుప్తా అన్నారు. ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ సీఎంగా పనిచేసిన సమయంలో అధికారిక నివాసంగా ఉపయోగించిన బంగ్లాను 'శీష్ మహల్ (అద్దాల మేడ)'గా భాజపా అభివర్ణించింది. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసి ఆయన 7-స్టార్ రిసార్ట్‌గా మార్చుకున్నారని విమర్శించింది. ఆప్ మోసాలకు ఆ మహల్ ఓ ఉదాహరణ అంటూ భాజపా ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లింది. ఆప్ ప్రభుత్వంపై వచ్చిన ఈ అవినీతి ఆరోపణలు అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీని దెబ్బతీశాయి.

## భవనంపై నుంచి దూకి.. విదేశాంగ శాఖ అధికారి ఆత్మహత్య



**న్యూఢిల్లీ :** విదేశాంగశాఖకు చెందిన అధికారి జితేంద్ర రావత్ ఆత్మహత్యకు పాల్పడ్డారు. భవనంపై నుంచి దూకి ప్రాణాలు తీసుకున్నారు. శుక్రవారం ఢిల్లీలోని చాణక్యపురి ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. దీనిపై ఆ శాఖ స్పందించింది. విదేశాంగశాఖకు చెందిన రెసిడెన్షియల్ సొసైటీలో అధికారులు నివాసం ఉంటున్న భవనం టెర్రస్ పైనుంచి దూకి రావత్ బలవన్మరణానికి పాల్పడ్డారు. ఆయన తన తల్లితో పాటు ఆ ఇంట్లో ఉంటున్నారు. రావత్ భార్య, ఇద్దరు పిల్లలు ఉత్తరాఖండ్ రాజధాని దేహ్రాదూన్‌లో నివసిస్తున్నారు. కొంతకాలంగా డిప్రెషన్‌తో బాధపడుతూ ఆయన చికిత్స కూడా తీసుకుంటున్నారు. ఈ ఘటనకు సంబంధించి ఎలాంటి సూసైడ్ నోట్ లభించలేదని ఢిల్లీ పోలీసులు తెలిపారు. విదేశాంగ శాఖ ఆయన మృతిని ధ్రువీకరిస్తూ.. ఒక ప్రకటన విడుదల చేసింది. "ఈ క్లిష్ట సమయంలో ఆ కుటుంబానికి అన్ని రకాలుగా సాయం అందిస్తున్నాం. కేసు విచారణలో ఎప్పటికప్పుడు ఢిల్లీ పోలీసులతో సంప్రదింపులు చేస్తున్నాం" అని పేర్కొంది. బాధిత కుటుంబం గోప్యత దృష్ట్యా ఇతర వివరాలేవీ వెల్లడించడం లేదని తెలిపింది.



## తన చావుకు భార్యే కారణమంటూ.. కంపెనీ వెబ్‌సైట్‌లో ఆత్మహత్య లేఖ

**ముంబయి:** తన చావుకు భార్యే కారణమంటూ ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డారు. కంపెనీ వెబ్‌సైట్‌లో సూసైడ్ నోట్‌ను పోస్టు చేసి, ముంబయిలో ఒక హోటల్ గదిలో బలవంతంగా ప్రాణాలు తీసుకున్నారు. కొన్ని రోజుల క్రితం జరిగిన ఈ ఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. మృతుడి పేరు నిశాంత్ త్రిపాఠి. అతడు ఇటీవల ముంబయిలోని ఒక హోటల్‌లో దిగారు. చనిపోవడానికి ముందు తన గదికి 'డు నాట్ డిస్టర్బ్' అనే బోర్డు బయట తగిలించి ఉంచారు. దాంతో సిబ్బంది అటువైపుగా వెళ్లలేదు. కానీ ఎంతకీ అతడు గది నుంచి బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చిన సిబ్బంది తమవద్ద ఉన్న తాళం చెవితో గది తలుపులు తెరిచారు. అలాగే పోలీసులకు సమాచారం అందించారు. కానీ అప్పటికే నిశాంత్ మరణించారు. చనిపోవడానికి ముందు తన కంపెనీ వెబ్‌సైట్‌లో సూసైడ్ నోట్‌ను షేర్ చేశారు. అందులో తన భార్య పట్ల తనకున్న ప్రేమను వ్యక్తంచేశారు. భార్యతో పాటు ఆమె బంధువు తన చావుకు కారణమని పేర్కొన్నారు. "నువ్వు ఈ లేఖ చదివే సమయానికి నేనుండను. మనిద్దరి మధ్య జరిగిన వాటికి నేను నిన్ను ద్వేషించాలి. కానీ నేను ప్రేమనే ఎంచుకుంటా. నేను అప్పుడు, ఇప్పుడు నిన్ను ప్రేమిస్తున్నా. అది ఎప్పటికీ పోదు. మీ ఇద్దరి వల్ల నేను పడిన వేదనంతా నా తల్లికి తెలుసు. మీరు ఆమెను కలవొద్దు. ఇది నా కోరిక. ఇప్పటికే ఆమె చాలా బాధ పడింది. నా తల్లిని ప్రశాంతంగా అయినా బాధ పడనివ్వండి" అని ఆ లేఖలో వాపోయారు. నిశాంత్ తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేశారు. నిశాంత్ తల్లి ఒక మహిళా హక్కుల కార్యకర్త. తన కుమారుడి మరణంపై తీవ్ర ఆవేదనకు గురైన ఆమె.. సోషల్ మీడియా వేదికగా పోస్టు పెట్టారు. "ఇంక నాకు జీవితమే లేదు. ఇప్పుడు నేనొక జీవచ్ఛవాన్ని. నా బిడ్డ నన్ను వదిలిపెట్టి వెళ్లిపోయాడు" అని రాసుకొచ్చారు. కొన్ని నెలల క్రితం భార్య వేధింపులు తట్టుకోలేక అతుల్ సుభాశ్ బెంగళూరులో ఆత్మహత్య చేసుకోవడం కలకలం రేపిన సంగతి తెలిసిందే. భార్యతో తాను అనుభవిస్తున్న మానసిక క్షోభకు సంబంధించి రాసిన 40 పేజీల లేఖను ఇ-మెయిల్ ద్వారా సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు, తన కార్యాలయం అధికారులు, సిబ్బంది, కుటుంబసభ్యులకు పంపించి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆ తర్వాత ఆ తరహాలో పలు ఘటనలు వెలుగు చూశాయి. ఇటీవలే ముంబయిలోని ప్రముఖ ఐటీ కంపెనీలో మేనేజరుగా పనిచేస్తున్న ఆగ్రావాసి మానవ్‌శర్మ (30) తన మరణానికి భార్య కారణమని పేర్కొంటూ ఫిబ్రవరి 24న ఆత్మహత్య చేసుకొన్నాడు. ఈ వరుస ఘటనలు చర్చనీయాంశంగా మారాయి.

# మిమ్మల్ని తీసుకెళ్లడానికి వస్తున్నాం

## వ్యోమగాములకు ట్రంప్ సందేశం



**వాషింగ్టన్:** అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో వ్యోమగాములు సునీతా విలియమ్స్, బుచ్ విల్‌మోర్ 9 నెలలుగా చిక్కుకుపోయిన సంగతి తెలిసిందే. త్వరలోనే వారు భూమి మీదకు రానున్నట్లు పలు మీడియా సంస్థలు పేర్కొంటున్నాయి. సునీత కూడా మంగళవారం ఐఎస్‌ఎస్ నుంచి విలేకరులతో మాట్లాడుతూ త్వరలోనే భూమి మీదకు చేరుకుంటానని తెలిపారు. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. 'మేము మిమ్మల్ని ప్రేమిస్తున్నాం.. తీసుకెళ్లడానికి వస్తున్నాం' అని వ్యోమగాములకు సందేశం పంపిస్తూ భరోసా ఇచ్చారు. అత్యంత అసమర్థ అధ్యక్షుడి పాలన (బైడెన్) కారణంగానే ఇంతకాలం మీరు చిక్కుకుపోయారని.. వారిని భూమి పైకి తీసుకువచ్చేందుకు బైడెన్ ప్రభుత్వం ఎలాంటి ప్రయత్నం చేయలేదని మండిపడ్డారు. వారు చేసిన ఆలస్యం వల్ల వ్యోమగాములు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సివస్తోందని విమర్శించారు. ఇకపై అలా జరగనివ్వనని ఆయన పేర్కొన్నారు. వ్యోమగాములను సురక్షితంగా భూమి పైకి తీసుకొచ్చే బాధ్యతను ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు అప్పగించినట్లు ట్రంప్ వెల్లడించారు. దాదాపు రెండు వారాల్లో మస్క్ స్పేస్‌ఎక్స్ క్యాప్సూల్‌ను ప్రయోగించడానికి సిద్ధమవుతున్నట్లు తెలిపారు. ప్రణాళిక ప్రకారం ఐఎస్‌ఎస్‌లో ఉన్న వ్యోమగాములు సునీతా విలియమ్స్, బచ్ విల్మోర్‌లు వారం రోజులకే భూమిని చేరుకోవాల్సి ఉంది. అయితే స్టార్‌లైనర్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో వ్యోమగాములు లేకుండానే అది భూమిని చేరుకుంది. సునీతా విలియమ్స్, విల్‌మోర్‌లు అప్పటినుంచి ఐఎస్‌ఎస్‌లోనే ఉంటున్నారు. వారిని తిరిగి తీసుకురావడానికి నాసా స్పేస్‌ఎక్స్‌తో కలిసి పనిచేస్తోంది. ఈ ఇద్దరు వ్యోమగాములను తీసుకురావాలంటే అంతకంటే ముందు కొందరిని ఐఎస్‌ఎస్‌కు పంపించాల్సి ఉంటుంది. ఈ ప్రయోగం చేపట్టడానికి స్పేస్‌ఎక్స్ సమయం కావాలనడంతో ఈ ఆలస్యం జరిగిందని గతంలో అధికారులు పేర్కొన్నారు. తాజాగా వ్యోమగాములు స్పేస్ నుంచి మీడియాతో మాట్లాడారు. తమ కోసం మార్చి 12న స్పేస్‌ఎక్స్‌కు చెందిన క్రూ-10 అంతరిక్షనౌక రానుందని, నౌకలో కొత్తగా ఐఎస్‌ఎస్‌లోకి వచ్చే వ్యోమగాములు తమ బాధ్యతలు తీసుకోనున్నారని చెప్పారు. తర్వాత మార్చి 19న ఆ నౌకలోనే తిరిగి భూమి మీదకు తాము బయల్దేరనున్నామని తెలిపారు. అయితే ట్రంప్ తాజా ప్రకటనతో వారిని భూమిపైకి తీసుకు వచ్చేందుకు స్పేస్‌ఎక్స్ చేపట్టిన చర్యలను వేగవంతం చేసినట్లు తెలుస్తోంది.

## విరోధం వద్దు .. కలిసి పనిచేద్దాం

### భారత్‌కు చైనా మంత్రి సూచన



**న్యూఢిల్లీ :** న్యూఢిల్లీ -బీజింగ్ పరస్పరం విరోధం పెంచుకొనే కంటే భాగస్వాముల్లా కలిసి పనిచేయడం ఉత్తమమని చైనా విదేశాంగ మంత్రి వాంగ్‌యీ అభిప్రాయపడ్డారు. ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాలపై ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఆసియాలోనే కీలకమైన తమ రెండు దేశాల మధ్య సహకారం అత్యంత ముఖ్యమన్నారు. దీనిని ఆయన సమన్వయంతో చేసే నృత్యంతో పోల్చారు. "చైనా-భారత్ భాగస్వాములుగా పరస్పర విజయానికి సహకరించుకోవాలి. దీనిని సాధించడానికి డ్రాగన్-ఎలిఫెంట్ డ్యాన్స్ ఒక్కటే ఇరుపక్షాలకు ఉన్న సరైన మార్గం" అని వాంగ్ యీ వ్యాఖ్యానించారు. ఇరుదేశాలు పరస్పరం చిన్నబుచ్చుకోవడం కంటే.. ఒకరికొకరు మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. పరస్పర సహకారమే రెండు దేశాల ప్రజల ప్రాథమిక ప్రయోజనాలను బలోపేతం చేస్తుందన్నారు. ఇక న్యూఢిల్లీ-బీజింగ్ మధ్య మెరుగైన సంబంధాలు ప్రపంచవ్యాప్తంగా గ్లోబల్ సౌత్ దేశాలకు కూడా ప్రయోజనమన్నారు. అంతర్జాతీయ సంబంధాల్లో ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసి.. అంతర్జాతీయ వేదికలపై గ్లోబల్ సౌత్ (పేద దేశాల) స్థానాన్ని శక్తిమంతం చేస్తుందన్నారు. ఇరుదేశాల మధ్య వివాదాలను దౌత్యమార్గంలో పరిష్కరించుకొంటామని.. సమష్టి ప్రయోజనాలను కాపాడుకోవడానికి సహకారం అవసరమని వాంగ్ అభిప్రాయపడ్డారు. "చర్చల ద్వారా పరిష్కారం కానీ సమస్యే లేదు. అదే సమయంలో సహకారంతో చేరుకోలేని లక్ష్యాలు లేవు" అని వెల్లడించారు. దక్షిణాఫ్రికాలో జరిగిన జీ20 విదేశాంగ మంత్రుల భేటీలో భారత మంత్రి జైశంకర్‌తో చైనా మంత్రి వాంగ్ యీ భేటీ అయ్యారు. ఆ తర్వాత కొన్ని వారాల్లోనే ఈ ప్రకటనలు వెలువడ్డాయి. వాస్తవానికి 2020లో గల్వాన్ ఘర్షణ తర్వాత ఇరుదేశాల మధ్య సంబంధాలు అట్టడుగుస్థాయికి పడిపోయాయి. ఆ తర్వాత పలు విడతలుగా ఇరుదేశాలకు చెందిన దౌత్యవేత్తలు, సైనికాధికారులు చర్చలు జరిపారు. 2024లో ప్రధాని మోదీ-చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ బ్రిక్స్ సదస్సు సందర్భంగా కజాన్‌లో భేటీ అయ్యారు. ఆ తర్వాతనే సరిహద్దుల్లో ఉద్రిక్తతలు ఉన్నచోట్ల నుంచి ఇరుదేశాల బలగాలు వెనక్కి తగ్గి పాత స్థితికి చేరుకొన్నాయి. మరోవైపు ఈ ఏడాది చైనా షాంఘై సహకార సంస్థ సమావేశాలకు ఆతిథ్యం ఇస్తోంది. భారత ప్రధాని మోదీ అందులో పాల్గొనడం అత్యంత కీలకంగా మారనుంది.

## విమానంలో దుస్తులు విప్పి ప్రయాణికురాలి వింత చేష్టలు

**వాషింగ్టన్:** విమానంలో ఓ మహిళ చేసిన వికృత చేష్టలకు ప్రయాణికులంతా భయభ్రాంతులకు గురయ్యారు. అమెరికాలోని హ్యూస్టన్ నుంచి ఫీనిక్స్ వెళ్తున్న సౌత్‌వెస్ట్ ఎయిర్‌లైన్స్ ఫ్లైట్‌లో ఆమె ప్రవర్తన తీవ్ర గందరగోళానికి దారితీసింది. దాంతో విమానం వెనక్కి మళ్లాల్సి వచ్చింది. అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం.. హ్యూస్టన్‌లోని విలియమ్ పీ హాబీ విమానాశ్రయం నుంచి విమానం టేకాఫ్ అవుతుండగా.. ఓ మహిళ బిగ్గరగా కేకలు వేయడం ప్రారంభించింది. తన దుస్తులు తొలగించి, పెద్దగా అరుస్తూ అటూఇటూ తిరగడం ప్రారంభించింది. కాక్‌పిట్ డోర్ వద్దకువెళ్లి, దానిని బాదుతూ తనను దించేయాలని డిమాండ్ చేసింది. సుమారు 25 నిమిషాల పాటు ఆమె ఇలాంటి చేష్టలకు పాల్పడిందని ప్రయాణికుడు ఒకరు వెల్లడించారు. దాంతో పైలట్లు విమానాన్ని వెనక్కి మళ్లించారు. ఒంటిపై దుప్పటికప్పి, ఫ్లైట్ దించేసి హ్యూస్టన్ పోలీసులకు అప్పగించారు. ఆమె పారిపోవడానికి ప్రయత్నించినట్లు తెలుస్తోంది. తర్వాత ఆమెను మానసిక వైద్య కేంద్రానికి తరలించారు. ప్రస్తుతానికి ఆమెపై ఎలాంటి కేసు నమోదు చేయలేదని పోలీసులు తెలిపారు. ఈ ఘటనతో తాము తీవ్ర ఆందోళనకు గురయ్యామని ప్రయాణికులు తెలిపారు. " ఆమె ప్రవర్తనతో మేం తీవ్ర అసౌకర్యాన్ని ఎదుర్కొన్నాం. భయపడిపోయాం" అన్నారు. ఈ ఘటన కారణంగా 90 నిమిషాల ఆలస్యంతో విమానం గమ్యస్థానానికి బయల్దేరింది. ప్రయాణికులకు కలిగిన అంతరాయానికి చింతిస్తున్నట్లు సౌత్‌వెస్ట్ ఎయిర్‌లైన్స్ ప్రకటన విడుదల చేసింది.

## ఎప్పటికీ గెలవని యుద్ధం మొదలుపెట్టారు

### కేంద్రంపై స్టాలిన్ విమర్శలు



**చెన్నై:** జాతీయ విద్యావిధానం (ఎన్‌ఈపీ)లో భాగమైన త్రిభాషా సూత్రం అమలుపై తమిళనాడు- కేంద్ర ప్రభుత్వాల మధ్య వివాదం కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఈ విధానంతో హిందీని తమపై రుద్దుతున్నారంటూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ మరో పోస్టు పెట్టారు. ఈ సందర్భంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌పై ఆయన విమర్శలు చేశారు. 'కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఎప్పటికీ గెలవని యుద్ధం మొదలుపెట్టారు. "చెట్టు ప్రశాంతంగా ఉండాలని అనుకున్నా.. గాలి ఊరుకోదు.." అలాగే.. మమ్మల్ని రెచ్చగొట్టిన ఆయనకు వరుసగా లేఖాస్త్రాలు సంధిస్తున్నాం. ఎన్‌ఈపీని తిరస్కరిస్తున్న తమిళనాడు విద్యావిధానంలో ఇప్పటికే అనేక లక్ష్యాలను సాధించింది. ఎల్‌కేజీ విద్యార్థి పీహెచ్‌డీ హోల్డర్‌కి ఉపన్యాసం ఇచ్చినట్లు ఉంది. మేం ఢిల్లీ ఆదేశాలను తీసుకోం. త్రిభాషా విధానంపై భాజపా సర్కారు చేస్తున్న సంతకాల ప్రచారం హాస్యాస్పదంగా ఉంది. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో ఈ అంశాన్నే ప్రధాన అజెండాగా చేసుకొని బరిలో దిగాలని సవాల్ విసురుతున్నా. పథకాల దగ్గర నుంచి కేంద్ర ప్రభుత్వ సంస్థలకు ఇచ్చే అవార్డుల వరకు అన్నింటికీ హిందీ పేర్లను పెట్టారు. దేశంలో అధికంగా ఉన్న హిందీయేతర ప్రజలను ఇది ఉక్కిరిబిక్కిరి చేస్తుంది' అని స్టాలిన్ పేర్కొన్నారు.

**ఇంజినీరింగ్, వైద్య విద్యను తమిళంలో ప్రారంభించండి..**

త్రిభాషా విధానాన్ని స్టాలిన్ వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో.. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా స్పందించారు. చెన్నైకి 70 కిలోమీటర్ల దూరంలో ఉన్న రాణిపేటలోని ఆర్టీసీ తక్కోలం వద్ద సీఐఎస్‌ఎఫ్ 56వ రైజింగ్ డేను నిర్వహించారు. ఇందులో అమిత్‌షా పాల్గొని మాట్లాడుతూ... ప్రధాని నేతృత్వంలోని కేంద్రం మాతృభాషా విధానంలోనూ పరీక్షలు రాసేందుకు అనుమతిని ఇచ్చిందన్నారు. రాష్ట్రంలో ఇంజినీరింగ్, వైద్య విద్యను తమిళంలో ప్రారంభించాలని ఈసందర్భంగా స్టాలిన్‌ను కోరారు. జాతీయ విద్యావిధానం(ఎన్‌ఈపీ)లో భాగమైన త్రిభాషా సూత్రంలో భాగంగా దేశవ్యాప్తంగా విద్యార్థులు హిందీ, ఇంగ్లీషు, ఒక స్థానిక భాషను నేర్చుకోవాలని కేంద్రం పేర్కొంది. అయితే తాము ద్విభాషా సూత్రానికే కట్టుబడి ఉంటామని, హిందీని బలవంతంగా రుద్దితే ఊరుకోబోమని డీఎంకే ప్రభుత్వం స్పష్టంచేస్తోంది. దీనిని వ్యతిరేకిస్తూ స్టాలిన్ పోస్టులు పెడుతూ కేంద్రంపై విమర్శలు చేస్తున్నారు.

## పంజాబ్‌లో భారీ కుట్ర భగ్నం

### ముగ్గురు బబ్బర్ ఖల్సా ఉగ్రవాదుల అరెస్ట్




**పంజాబ్ :** పంజాబ్‌లో హత్యలకు ఖలిస్థానీ సంస్థ బబ్బర్ ఖల్సా ఇంటర్నేషనల్ పన్నిన కుట్రను ఇంటెలిజెన్స్, పోలీసులు భగ్నం చేశారు. ముగ్గురు ఉగ్రవాదులను అరెస్టు చేసి భారీగా ఆయుధాలను స్వాధీనం చేసుకొన్నారు. నిందితులను జగ్‌రూప్ సింగ్ అలియాస్ జగ్గా, సుఖ్‌జిత్ సింగ్ అలియాస్ సుక్కా, నవ్‌ప్రీత్ సింగ్ అలియాస్ నవ్‌లుగా గుర్తించారు. వీరి నుంచి అత్యాధునిక గ్లాక్ 9ఎంఎం పిస్టోల్, ఒక మ్యాగ్జిన్, పీఎక్స్5 స్టామ్ పిస్టోల్, ఒక మ్యాగ్జిన్, ఒక దేశీయ తయారీ 30 బోర్ గన్, మరో దేశీయ తయారీ 32 బోర్ తుపాకీ, తూటాలను స్వాధీనపర్చుకొన్నారు. ప్రాథమిక దర్యాప్తులో అమెరికా కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహించే గురుప్రీత్ సింగ్ అలియాస్ గోపీ నౌషహరియా వీరి హ్యాండిలర్‌గా గుర్తించారు. అతడు పాక్ కేంద్రంగా పనిచేసే ఖలిస్థానీ ఉగ్రవాదులు హర్విందర్ సింగ్ రిండా, గ్రీస్ కేంద్రంగా పనిచేసే లాడి బకాపురియాకు అత్యంత సన్నిహితుడు. తాజాగా నిందితులపై అమృత్‌సర్‌లో కేసు నమోదు చేశారు. మహా కుంభమేళాలో ఉగ్రదాడికి పథకం వేసిన ఉగ్రవాది లాజర్ మసీహ్‌ను ఉత్తర్‌ప్రదేశ్‌లోని కౌశంబిలో అరెస్టు చేశారు. అతడికి ఐఎస్‌ఐ, బబ్బర్ ఖల్సాతో సంబంధాలున్నాయి. గతంలో ఆయుధాలు, హెరాయిన్ స్మగ్లింగ్ కేసులో ఒకసారి జైలుకు వెళ్లిన మసీహ్.. అనారోగ్యంతో చికిత్స పొందుతూ 2024 సెప్టెంబరు 24న ఆసుపత్రి నుంచి పారిపోయాడు. తర్వాత సోనీపత్, ఢిల్లీలో తలదాచుకున్నాడు. గతంలో పీలీభిత్‌లో ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన వినేశ్‌సింగ్ అలియాస్ రవితో అతనికి సంబంధాలున్నాయి. అమెరికాలో ఉంటున్న ఖలిస్థాన్ ఉగ్రవాదితో, ఖతార్‌లో తలదాచుకుంటున్న మరో ఉగ్రవాదితోనూ సంబంధాలు కొనసాగిస్తున్నాడు. అతని కదలికలపై సమాచారంతో కౌశాంబిలోని కోఖ్రాజ్ ఠాణా పరిధిలో పంజాబ్ పోలీసులతో కలిసి ఉత్తర్‌ప్రదేశ్ ఎస్‌టీఎఫ్ బృందం సభ్యులు గురువారం తెల్లవారుజామున 3.30 గంటలకు దాడిచేసి పట్టుకున్నారు. అతని నుంచి మూడు గ్రనేడ్లు, రెండు డిటోనేటర్లు, విదేశీ తయారీ పిస్తోల్, 13 క్యాట్రిడ్జ్‌లు, పేలుడు స్వభావమున్న పౌడర్, సిమ్ లేని ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. మహాకుంభమేళాలో భద్రత ఎక్కువగా ఉండటంతో అతడి ఉగ్రదాడి ప్రణాళిక పారలేదు.

## జీన్స్ వేసుకోండి.. కానీ మీ 'జీన్స్' మరవొద్దు

### ఆధ్యాత్మిక గురువు చిదానంద సరస్వతి



**న్యూఢిల్లీ :** ఢిల్లీలో ఓ మీడియా సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో పరమార్థ నికేతన్ ఆశ్రమ గురువు.. ఆధ్యాత్మికవేత్త అయిన చిదానంద సరస్వతి పాల్గొన్నారు. ఇందులోభాగంగా ఆయన మాట్లాడుతూ కుంభమేళా సమయంలో జరిగిన ఓ సంఘటనను గుర్తుచేసుకున్నారు. తన వద్దకు ఓ యువకుడు వచ్చి తాను ఆధ్యాత్మికత వైపు దృష్టిసారించాలంటే.. ప్రస్తుతం తాను వేసుకుంటున్న జీన్స్‌ను వదిలేసి.. సంప్రదాయ దుస్తులు మాత్రమే ధరించాల్సి ఉంటుందా అని ప్రశ్నించాడని తెలిపారు. అయితే యువత ఎటువంటి దుస్తులు ధరిస్తున్నారని కాదు.. ఎటువంటి విలువలు పాటిస్తున్నారనేదే ముఖ్యమని ఆయన అభిప్రాయం వ్యక్తంచేశారు. కుంభమేళాకు చాలామంది జీన్స్ ధరించి వచ్చారని, దాంతో ఎలాంటి ఇబ్బంది లేదని వివరించారు. అయితే వచ్చినవారు వారి జీన్స్(మూలాలను), సంస్కృతీ సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను మరిచిపోతేనే ఆందోళన చెందాల్సిన అవసరం ఉందని అన్నారు.

**మస్క్ కుంభమేళాలో పాల్గొనాలనుకున్నారు**

ఈ కార్యక్రమంలో నిరంజని అఖాడా అధిపతి స్వామి కైలాసానంద గిరి మాట్లాడుతూ.. ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ కుంభమేళాకు రావాలని అనుకున్నారని తెలిపారు. ఈమేరకు ఆయన సందేశాన్ని స్టీవ్ జాబ్స్ సతీమణి తమకు చేరవేశారని అన్నారు. కుంభమేళాలో ఏర్పాటుచేసిన తమ శిబిరంలో బస చేయడానికి మస్క్ ఆసక్తి చూపినట్లు పేర్కొన్నారు. కుంభమేళా నిర్వహణ గురించి మాట్లాడుతూ.. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినందుకు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాన్ని ప్రశంసించారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా యోగి ఆదిత్యనాథ్ ఉండడం వల్లే ఇది సాధ్యమైందని కైలాసానంద అన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో ఇటీవల నిర్వహించిన కుంభమేళాలో కోట్లాది మంది భక్తులు పాల్గొన్నారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి విదేశీయులు కూడా భారీ సంఖ్యలో తరలివచ్చారు.

## దుబాయే కాదు అమెరికా, ఐరోపా కూడా 17 గోల్డ్ బార్లు తెచ్చిన నటి రన్యారావు



**న్యూఢిల్లీ :** దుబాయ్ నుంచి అక్రమంగా బంగారం తీసుకొస్తూ రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయిన కన్నడ నటి రన్యా రావు కేసులో కీలక విషయాలు వెలుగులోకి వస్తు న్నాయి. యూఏఈ నుంచి నటి రన్యారావు 17 బంగారు బిస్కెట్లను తీసుకొచ్చారని అధికారులు తెలిపారు. దుబాయ్‌కు మాత్రమే కాకుండా యూరప్, సౌదీ అరేబియా, అమెరికా, పశ్చిమాసియా దేశాలకు తాను ప్రయాణించినట్లు డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్‌కి ఆమె తెలియజేశారు. అయితే ఈ కేసుకు సంబంధించి తాను వెల్లడించిన విషయాలను వీలైనంత రహస్యంగా ఉంచాలని ఆమె అధికారులను కోరినట్లు తెలుస్తోంది. తాను బాగా అలసిపోయానని.. కొంత సమయం విశ్రాంతి ఇప్పించాలని విచారణ సమయంలో రన్యా రావు అధికారులను అభ్యర్థించారని తెలిపారు. ఈ కేసులో దర్యాప్తునకు సహకరిస్తానని.. ఎప్పుడు పిలిచినా విచారణకు హాజరవుతానని ఆమె పేర్కొన్నారు. రన్యా రావు గతేడాది 30 సార్లు దుబాయ్‌కు వెళ్లారని.. కేవలం 15 రోజుల్లో నాలుగుసార్లు.. ప్రతి ట్రిప్‌లో కొన్ని కిలోల బంగారాన్ని అక్రమంగా రవాణా చేసినట్లు దర్యాప్తులో తేలిందని అధికారులు పేర్కొన్నారు. ఇందుకుగాను ప్రతి ట్రిప్‌కు దాదాపు రూ. 12-13లక్షలు తీసుకున్నట్లు గుర్తించామన్నారు. ఇటీవల దుబాయ్ నుంచి బెంగళూరుకు 14.2 కిలోల బంగారంతో వచ్చిన ఆమెను.. విమానాశ్రయం నుంచి నిష్క్రమించే చివరి నిమిషంలో అధికారులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. తరచూ దుబాయ్‌కు వెళ్లడం.. వెళ్లిన ప్రతిసారీ ఒకే రకమైన దుస్తులు ధరించడంతో అనుమానం వచ్చి ఆమెపై నిఘా పెట్టగా ఈ స్మగ్లింగ్ వ్యవహారం బయటపడింది. దీంతో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ కేసు వెనక ఓ ప్రముఖ రాజకీయ నాయకుడి హస్తం ఉన్నట్లు స్థానిక మీడియా సంస్థలు వెల్లడిస్తున్నాయి. నటి రన్యా రావు భర్త జతిన్ హుక్కేరి ఆమెతో కలిసి పలుమార్లు దుబాయ్ వెళ్లడంతో.. అతడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### సునీల్ ఛెత్రి
# మళ్లీ వచ్చేస్తున్నాడు



**రిటైర్మెంట్ వెనక్కి తీసుకున్న ఫుట్‌బాల్ ఆటగాడు**

భారత ఫుట్?బాల్ లెజెండరీ ప్లేయర్ సునీల్ ఛెత్రి తన రిటైర్మెంట్ నిర్ణయంపై యూ టర్న్ తీసుకున్నాడు. మళ్లీ జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నట్లు ప్రకటించాడు. ఫిఫా ఆధ్వర్యంలో ఈ నెలలో జరగనున్న అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో ఛెత్రి మళ్లీ బరిలోకి దిగనున్నాడు. ఈ మేరకు ఆల్ ఇండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ సోషల్ మీడియాలో ప్రకటించింది. ఫిఫా ఆధ్వర్యంలో ఈనెలలో 'ఇంటర్నేషనల్ విండో' జరగనుంది. పలు టోర్నీల్లో క్వాలిఫై అవ్వడం కోసం దీన్ని నిర్వహిస్తారు. ఈ నెల 19న మాల్దీవులతో జరగనున్న ఫ్రెండ్లీ మ్యాచ్‌లో భారత్ జట్టు ఆడనుంది. ఇక 2027లో జరగనున్న %ూఖీజఆసియా కప్‌లో అర్హత సాధించేందుకు భారత జట్టు ఈనెల 25న బంగ్లాదేశ్‌తో తలపడనుంది. కాగా, ఈ స్టార్ ఆటగాడు గతేడాది జూన్‌లో అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు వీడ్కోలు పలికాడు. చివరిసారిగా 2024 ఫిఫా వరల్డ్?కప్? క్వాలిఫైయర్స్?లో జూన్ 6న కువైట్?తో జరిగిన మ్యాచ్?లో భారత్?కు ప్రాతినిధ్యం వహించాడు. ఇక ఆ తర్వాత ఇండియన్ సూపర్‌లీగ్‌లో బెంగళూరు ఎఫ్‌సీ తరఫున ఆడుతున్నాడు. 19 ఏళ్ల పాటు జాతీయ జట్టుకు సుదీర్ఘంగా ఆడిన సునీల్ ఛెత్రి తన కెరీర్‌లో ఎన్ని అత్యుత్తమ రికార్డులు నమోదు చేశాడు. భారత్ తరఫున అత్యధిక గోల్స్ (95) చేసిన ఆటగాడిగా నిలిచాడు. ఓవరాల్?గా ప్రపంచవ్యాప్తంగా అత్యధిక గోల్స్ చేసిన లిస్ట్?లో ఛెత్రి నాలుగో స్థానంలో ఉన్నాడు. అతడి కంటే ముందు ఈ జాబితాలో పోర్చుగల్ లెజెండ్ క్రిస్టియానో రొనాల్డో (128 గోల్స్, 205మ్యాచ్?ల్లో) టాప్‌లో ఉండగా, ఇరాన్ ప్లేయర్ అలీ డే (108 గోల్స్, 148 మ్యాచ్?ల్లో) రెండు, అర్జెంటినా స్టార్? లియోనల్ మెస్సీ (106, 180 మ్యాచ్?ల్లో) మూడో స్థానంలో ఉన్నారు.

## ప్లే ఆఫ్స్ రేసులోనే ముంబై..

**యూపీపై విజయంతో ఆశలు సజీవం**

డబ్ల్యూపీఎల్‌లో ముంబై ఇండియన్స్ ప్లే ఆఫ్స్ కు చేరువగా వచ్చింది. గురువారం లక్నో ల జరిగిన లీగ్ మ్యాచ్ లో ఆరు వికెట్ల తేడాతో ఆతిథ్య యూపీ వారియర్జ్ పై ఘన విజయం సాధించింది. అంతకుముందు టాస్ ఓడి ఫస్ట బ్యాటింగ్ చేసిన యూపీ.. నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల కు 150 పరుగులు చేసింది. ఓపెనర్ జార్జ్ వాల్ స్టన్నింగ్ ఫిఫ్టీ (33 బంతుల్లో 55, 12 ఫోర్లు)తో టాప్ స్కోరర్ గా నిలిచింది. అమెలియా కెర్ పాంచ్ పటాకా (5-32) తో సత్తా చాటింది. ఛేదనను 18.3 ఓవర్లలో నాలుగు వికెట్లకు 153 పరుగులు సాధించింది. ఓపెనర్ హీలీ మథ్యూస్ (46 బంతుల్లో 68, 8 ఫోర్లు, 2 సిక్సర్లు) అర్ధ సెంచరీతో ఆకట్టుకుంది. గ్రేస్ హారిస్ కు రెండు వికెట్లు దక్కాయి. ఈ విజయంతో యూపీ దాదాపుగా టోర్నీ నుంచి నిష్క్రమించినట్లే. శుక్రవారం జరిగే మ్యాచ్ లో ఢిల్లీ క్యాపిటల్స్‌తో గుజరాత్ జెయింట్స్ తలపడతారు. హీలీ మథ్యూస్ కే ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు దక్కింది. ఫస్ట్ బ్యాటింగ్ చేసిన యూపీకి ఓపెనర్లు హారిస్ (28), వాల్ కు అద్భుతమైన ఆరంభాన్నిచ్చారు. ముంబై బౌలర్లను సమర్థంగా ఎదుర్కొన్న ఈ జంట.. వేగంగాపరుగులు సాధిస్తూ, స్కోరు బోర్డును పరుగులెత్తించింది. తొలి వికెట్ కు 74 పరుగులు జత కావడంతో యూపీ భారీ స్కోరు సాధిస్తుందనిపించింది. మధ్యలో కెప్టెన్ దీప్తి శర్మ (27) కాస్త పోరాటం చేయడంతో యూపీ సవాలు విసరగలిగే స్కోరును సాధించింది. చివర్లో సోఫీ ఎకిల్ స్టోన్ (16) చిన్న క్యామియో ఆడింది. మిగతా బౌలర్లలో హీలీ మథ్యూస్ కు రెండు, నాట్ స్కివర్ బ్రంట్, పరుణిక సిసోడియాకు తలో వికెట్ దక్కింది. ఇక ఛేజింగ్ ప్రత్యర్థి బౌలర్లు ఎదురు దాడికి దిగి, స్కోరు బోర్డును పరుగులెత్తించింది. అమెలియా (10) విఫలమైనా, బ్రంట్ (37) తో కలిసి కీలక భాగస్వామ్యం నెలకొల్పింది. వీరిద్దరూ రెండో వికెట్ కు 92 పరుగులు జోడించడంతో ముంబై చేతిలోకి మ్యాచ్ వచ్చింది. ఈ క్రమంలో 35 బంతుల్లోనే ఫిఫ్టీ చేసుకుంది. అయితే చివర్లో త్వరగా మ్యాచ్ ముగించాలనే తొందరలో తను ఔటయ్యింది. ఆఖర్లో కెప్టెన్ హర్మన్ ప్రీత్‌కౌర్ (4) విఫలమైనా, అమన్ జ్యోత్ కౌర్ (12 నాటౌట్), యాస్తికా భాటియా (10నాటౌట్) అజేయంగా నిలిచి జట్టును విజయ తీరాలకు చేర్చారు. మిగతా బౌలర్లలో క్రాంతి గౌడ్, చినెల్ హెన్రీకి తలో వికెట్ దక్కింది. తాజా మ్యాచ్ తర్వాత బ్రంట్ కు ఆరెంజ్ క్యాప్, అమెలియాకు పర్పుల్ క్యాప్ లభించింది.

## ఐపీఎల్ టికెట్ల విక్రయాలు ప్రారంభం

ఐపీఎల్ జోష్ ప్రారంభమైంది. ఈనెల 22 నుంచి ప్రారంభమయ్యే మెగా టోర్నీ కోసం టికెట్ల అమ్మకాలు కూడా ప్రారంభమయ్యాయి. శుక్రవారం నుంచి టికెట్లు అమ్మకాలు స్టార్ట్ చేసినట్లు సన్ రైజర్స్ హైదరాబాద్ యాజమాన్యం తెలిపింది. జొమాటో కు చెందిన డిస్ట్రిక్ట్ యాప్‌లో ఈ టికెట్లను అందుబాటులో ఉంచనున్నట్లు పేర్కొంది. ప్రతి రెండు టికెట్లకుగాను ఒక జెర్సీని బహుమతిగా ఇవ్వనుంది. గత కొంతకాలంగా ఈ స్ట్రేటజీని ఫ్రాంచైజీ ఫాలో అవుతోంది. ఆన్ లైన్ లో టికెట్లు అమ్మకాలు జరుపుతుండగా, వీటిని ఫిజికల్ గా ఎక్కడ తీసుకోవాలో ఫ్రాంచైజీ తెలుపలేదు. దీనిపై కాస్త గందరగోళం నెలకొంది. అయితే త్వరలోనే దీనిపై స్పష్టత రానుందని తెలుస్తోంది. ఇక హైదరాబాద్ లో ఈనెల 23న రాజస్థాన్ రాయల్స్ తో తొలి మ్యాచ్ ను ఆడనుంది. అలాగే 27న లక్నో సూపర్ జెయింట్స్ తో తలపడనుంది. ఈ రెండు మ్యాచ్ లకు సంబంధించిన టికెట్లను అందుబాటులో ఉంచుతున్నట్లు ఫ్రాంచైజీ పేర్కొంది. ఇక గతేడాది రన్నరప్ సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టుకు ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. ఇంగ్లాండ్ ఆల్ రౌండర్ బైడెన్ కార్స్ స్థానంలో వియాన్ ముల్డర్ ను జట్టులోకి తీసుకుంది. తను గాయపడటంతో ఈ మార్పు చేసినట్లు తాజాగా ఒక ప్రకటనలో ఫ్రాంచైజీ యాజమాన్యం తెలిపింది. ఇక లీగ్ షెడ్యూల్ తో పాటు నాకౌట్ మ్యాచ్ లను కూడా ఈసారి ప్రకటించారు. మే 20న క్వాలిఫయర్ -1, 21న ఎలిమినేటర్ మ్యాచ్ లు హైదరాబాద్‌లో జరుగుతాయి.

# ఫైనల్ మ్యాచ్ కోసం ఎదురుచూపు



- దుబాయ్ వేదికగా 9న టైటిల్ పోరు
- భారత్- న్యూజిలాండ్ మధ్య తుది సమరం
- అందరి దృష్టి విలియమ్సన్, విరాట్ పైనే..
- చరిత్ర సృష్టించనున్న విరాట్ కోహ్లీ
- ఫైనల్ పోరుకు వర్షం అడ్డంకి..

ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025 ఫైనల్ మ్యాచ్‌లో భారత్ న్యూజిలాండ్‌తో తలపడనుంది. ఈ మ్యాచ్ మార్చి 9న దుబాయ్‌లో జరుగుతుంది. ఇక్కడ టీం ఇండియా ఈ పోటీలో ఆడిన అన్ని మ్యాచ్‌లలో విజయం సాధించింది. ఇది కాకుండా, భారత జట్టు తన చివరి లీగ్ మ్యాచ్‌లో న్యూజిలాండ్‌ను కూడా ఓడించింది. మొత్తం మీద, అనుభవం, నైతికత రెండింటిలోనూ రోహిత్ శర్మ సేన కివీస్ కంటే ముందంజలో ఉన్నట్లు కనిపిస్తోంది. ఈ ఫైనల్ మ్యాచ్ పాకిస్తాన్ గడ్డపై ఆడి ఉంటే, అది న్యూజిలాండ్‌కు లాభదాయకంగా ఉండేదని కొంతమంది చెబుతున్నారు. ఎందుకంటే, ఇటీవల బ్లాక్ క్యాప్స్ టీం పాకిస్తాన్ గడ్డపై వరుసగా 7 మ్యాచ్‌లను గెలిచింది. ఇది రికార్డు సమం చేయడం లాంటిది. ఫిబ్రవరి 2006 నుంచి జూన్ 2008 వరకు పాకిస్తాన్‌లో టీం ఇండియా వరుసగా 7 మ్యాచ్‌లలో విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఇక రెండవ సెమీఫైనల్లో న్యూజిలాండ్ దక్షిణాఫ్రికాను 50 పరుగుల తేడాతో ఓడించి, ఫైనల్ చేరుకుంది. ఐసీసీ నాకౌట్ పోటీల ఫైనల్లో ఒత్తిడిని మెరుగ్గా నిర్వహించే జట్టు విజేత అవుతుంది. టీం ఇండియా ఐదుసార్లు ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌కు అర్హత సాధించగా, న్యూజిలాండ్ మూడోసారి ఫైనల్‌కు చేరుకుంది. మార్చి 9న ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ తొలి సీజన్‌లో న్యూజిలాండ్‌పై ఎదురైన ఓటమికి ప్రతీకారం తీర్చుకోవడానికి భారత జట్టుకు ఒక సువర్ణావకాశం ఉంది. న్యూజిలాండ్ సంచలనం రచిన్ రవీంద్ర ఇప్పటివరకు ఐదు వన్డే సెంచరీలు సాధించాడు. ఈ ఐదు సెంచరీలు ఐసీసీ టోర్నమెంట్లలో మాత్రమే వచ్చాయి. రవీంద్ర విషయంలో భారత జట్టు జాగ్రత్తగా ఉండాలి. దీనితో పాటు, ఇప్పటివరకు ఐసీసీ పోటీలలో నాలుగు సెంచరీలు సాధించిన కేన్ విలియమ్సన్ కూడా సవాలును అందించడానికి సిద్ధంగా ఉన్నాడు. ప్రస్తుత టోర్నమెంట్‌లో భారత్‌పై అద్భుతమైన ఇన్నింగ్స్ కూడా ఆడాడు. విలియమ్సన్, విరాట్ కోహ్లీ బ్యాట్స్ సరైన సమయంలో గర్జిస్తున్నాయి. ఫైనల్‌లో ఈ ఇద్దరు దిగ్గజాల మధ్య జరిగే ఘర్షణ కూడా రెండు జట్లకు చూడదగ్గదే అవుతుంది. ఐసీసీ ఈవెంట్లలో భారత్ %-% న్యూజిలాండ్ జట్ల హెడ్ టు హెడ్ రికార్డులను పరిశీలిస్తే, ఇరుజట్లు రెండుసార్లు తలపడ్డాయి. ఇందులో న్యూజిలాండ్ పైచేయి సాధించింది. 2000 ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌లో, 2021 ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌లో రెండోసారి టైటిల్ కోసం రెండు జట్లు తలపడ్డాయి. కివీస్ జట్టు రెండు సార్లు గెలిచింది. ఇలాంటి పరిస్థితిలో, రాబోయే మ్యాచ్‌లో న్యూజిలాండ్ ఇదే ధోరణిని కొనసాగిస్తుందా లేదా భారత జట్టు ప్రతీకారం తీర్చుకుంటుందా అనేది చూడాలి. భారత స్టార్ బ్యాట్స్‌మన్ విరాట్ కోహ్లీ మార్చి 9ని తనకు చారిత్రాత్మక రోజుగా మార్చుకోగలడు. అతను ప్రపంచ రికార్డు సృష్టించడానికి కొన్ని పరుగుల దూరంలో ఉన్నాడు. న్యూజిలాండ్‌తో జరిగే మ్యాచ్‌లో విరాట్ కోహ్లీ ఛాంపియన్స్ ట్రోఫీ చరిత్రలో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలిచే అవకాశం ఉంది. ఇందుకుగాను కోహ్లీకి 46 పరుగులు మాత్రమే అవసరం. దీంతో ఈ టోర్నమెంట్ చరిత్రలో 791 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచిన క్రిస్ గేల్ రికార్డును బద్దలు కొట్టనున్నాడు. విరాట్ ఇప్పటివరకు 17 మ్యాచ్‌ల్లో 746 పరుగులు చేశాడు. ఇందులో ఒక సెంచరీ, 6 అర్ధ సెంచరీలు ఉన్నాయి. విరాట్ క్రిస్ గేల్ రికార్డును బద్దలు కొట్టి ఛాంపియన్స్ ట్రోఫీలో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా మారడమే కాకుండా, ఈ టోర్నమెంట్‌లో 800 పరుగులు పూర్తి చేసిన తొలి ఆటగాడిగా నిలిచే అవకాశం కూడా ఉంది. ప్రపంచంలో ఏ బ్యాట్స్‌మెన్ కూడా ఈ మైలురాయిని చేరుకోలేకపోయాడు. విరాట్ కోహ్లీ పాకిస్తాన్ (100 నాటౌట్), ఆస్ట్రేలియా (84 పరుగులు) పై అద్భుత ఫామ్‌లో ఉన్నాడు. 36 ఏళ్ల కోహ్లీ ఆస్ట్రేలియాతో జరిగిన సెమీ-ఫైనల్ మ్యాచ్‌లో ఒక భారీ ఘనతను సాధించాడు. వన్డేల్లో రన్-ఛేజ్‌లలో అతను 8000 పరుగుల మార్కును దాటాడు. ఈ ఘనతను సాధించడానికి అతను 159 ఇన్నింగ్స్‌లు తీసుకున్నాడు. 50 ఓవర్ల ఫార్మాట్‌లో లక్ష్యాన్ని ఛేదిస్తూ ఇన్ని పరుగులు చేసిన రెండవ బ్యాట్స్‌మన్‌గా మారాడు. లక్ష్యాన్ని ఛేదించే సమయంలో అత్యధిక పరుగులు చేసిన వారిలో సచిన్ టెండూల్కర్ మొదటి స్థానంలో ఉన్నాడు. మాస్టర్ బ్లాస్టర్ 232 ఇన్నింగ్స్‌లలో 8720 పరుగులు చేశాడు. ఈ జాబితాలో రోహిత్ శర్మ 6115 పరుగులతో మూడో స్థానంలో ఉన్నాడు. పరుగుల వేటలో అత్యంత వేగంగా 8000 పరుగులు సాధించిన బ్యాట్స్‌మన్ కోహ్లీ. ఈ విషయంలో అతను టెండూల్కర్‌ను విడిచిపెట్టాడు. నిజానికి, భారత్ వర్సెస్ న్యూజిలాండ్ మధ్య మ్యాచ్ దుబాయ్‌లో జరగాల్సి ఉంది. అక్కడ వర్షం పడే అవకాశం లేదు. అయితే, ఏదైనా సందర్భంలో వాతావరణం చెడుగా ఉంటే లేదా మ్యాచ్ రద్దు చేస్తే.. ఏ జట్టు ఛాంపియన్ అవుతుంది,

భారత్, న్యూజిలాండ్ మధ్య జరిగే ఫైనల్ మ్యాచ్ సమయంలో వర్షం పడితే, రిజర్వ్ డే ఏర్పాటు చేసుకునే నిబంధన ఉంది. దీనిలో ఆట మొదటి రోజు ఆగిపోయిన చోటు నుంచి ప్రారంభమవుతుంది. భారత్ వర్సెస్ న్యూజిలాండ్ మధ్య జరిగే ఫైనల్‌లో ఫలితం రావాలంటే, కనీసం 25 ఓవర్లు ఆడటం అవసరం. ఆ తర్వాత %ణూూ% ఆధారంగా ఫలితాన్ని ప్రకటిస్తారు. భారత్, న్యూజిలాండ్ మధ్య జరిగే ఫైనల్ మ్యాచ్ టై అయితే, ఐసీసీ సూపర్ ఓవర్‌కు కూడా అవకాశం కల్పించింది. భారత్ వర్సెస్ న్యూజిలాండ్ మధ్య జరిగే ఫైనల్ మ్యాచ్‌లో రెండు రోజులూ వర్షం పడి, ఏదైనా కారణం చేత ఫలితం నిర్ణయించబడకపోతే, భారత్, న్యూజిలాండ్ రెండు జట్లను ఉమ్మడి విజేతలుగా ప్రకటిస్తారు.

## ఫైనల్ మ్యాచ్‌కు రిఫరీ అంపైర్ల ప్రకటన

- జొయల్ విల్సన్ థర్డ్ అంపైర్ గా నియామకం
- ఫీల్డ్ అంపైర్లుగా రాఫెల్, ఇల్లింగ్‌వర్త్

2025 ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్ కోసం యావత్ క్రికెట్ ప్రపంచం ఎదురుచూస్తోంది. దుబాయ్ వేదికగా భారత్-న్యూజిలాండ్ మార్చి 09న టైటిల్? కోసం తలపడనున్నాయి. ఇరుజట్లు విజయం కోసం ఇప్పటికే సన్నాహాలు మొదలెట్టేశాయి. అటు మ్యాచ్? నిర్వహణ కోసం కూడా ఐసీసీ పనులు ప్రారంభించింది. ఈ క్రమంలో ఫైనల్ మ్యాచ్‌కు రిఫరీలుగా వ్యవహరించనున్న అంపైర్ల పేర్లను శుక్రవారం ప్రకటించింది. అంత ర్జాతీయ అంపైర్లు రాఫెల్, ఇల్లింగ్‌వర్త్ ఫైనల్ మ్యాచ్‌లో ఫీల్డ్ అంపైర్లుగా వ్యవహరించనున్నారు. జొయల్ విల్సన్ థర్డ్ అంపైర్ కాగా, కుమార ధర్మసేనను ఫోర్త్ అంపైర్‌గా ఐసీసీ నియమించింది. ఇక రాజన్ మదుగలే మ్యాచ్ రిఫరీగా వ్యవహరించనున్నారు. ఈ అంపైర్లందరూ ఐసీసీ ఎలైట్ ఎమిరేట్స్ ప్యానెల్ మెంబర్లే. అయితే ఈ మ్యాచ్‌కు ఫీల్డ్ అంపైర్‌గా వ్యవహరించనున్న ఇల్లింగ్ వర్త్ నాలుగుసార్లు ఐసీసీ అంపైర్ ఆఫ్ ది ఇయర్ అవార్డ్ గెలుచుకున్నాడు. అంతేకాకుండా గతేడాది వెస్టిండీస్‌లో జరిగిన టీ20 ఫైనల్ మ్యాచ్‌కు కూడా ఇల్లింగ్ వర్త్ అంపైర్‌గా ఉన్నాడు. ఆ మ్యాచ్‌లో భారత్ ఓటమి అంచుల్లో నుంచి బయటపడి అనూహ్యంగా విజయం సాధించింది. దీంతో భారత్ లక్కీ ఛార్మ్ ఇల్లింగ్‌వర్త్ ఉన్నాడులే అంటూ ఫ్యాన్స్ ఖుషి అవుతున్నారు. ఇంటర్నేషనల్ ఫేమస్ ఫీల్డ్ అంపైర్ రిచర్డ్ కెటిల్ బోరోగ్‌ఈ ఫైనల్‌లో అంపైరింగ్ చేయడం లేదు. దీంతో టీమ్‌ఇండియా ఫ్యాన్స్ సోషల్ మీడియాలో 'భారత్‌కు శుభసూచకం' అంటూ మీమ్స్ క్రియేట్ చేస్తున్నారు. అయితే గత కొన్నేళ్లుగా ఐసీసీ ఈవెంట్లలో టీమ్ ఇండియా ఆడిన నాకౌట్ మ్యాచ్‌లన్నింటిలోనూ కెటిల్ బోరోగ్ ఫీల్డ్ అంపైర్‌గా ఉన్నారు. దురదృష్టవశాత్తు భారత్ అన్నింట్లోనూ ఓడి ఇంటిబాట పట్టింది. ఇక 2024 టీ20 వరల్డ్‌కప్ ఫైనల్‌లో రిచర్డ్ లేడు. ఆ మ్యాచ్‌లో భారత్ నెగ్గి విశ్వవిజేతగా నిలిచింది. దీంతో ఆయన లేకపోవడమే టీమ్‌ఇండియాకు కలిసొస్తుం దంటూ ఫ్యాన్స్ సోషల్ మీడియాలో కామెం ట్లు చేస్తున్నారు. ఇక ఈ ఫైనల్ మ్యాచ్ ఆదివారం మధ్యాహ్నం 2.30 గంటలకు ప్రారంభం కానుంది.

## టీమిండియాకు బిగ్ షాక్

- గాయంతో ఇబ్బంది పడుతున్న హార్దిక్ పాండ్యా
- తుది పోరులో ఆడేది అనుమానం!?




ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌కు ముందు టీమిండియాకు బిగ్ షాక్ తగిలింది. భారత జట్టు ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా గాయంతో ఇబ్బంది పడుతున్నాడని సమాచారం. సెమీ ఫైనల్ ఆస్ట్రేలియాతో జరుగుతున్న మ్యాచ్‌లో హార్దిక్ పాండ్యా కాలుకు గాయమైంది. హార్దిక్ పాండ్యా పరుగు తీయడానికి ప్రయత్నిస్తూ గాయపడ్డాడు. కాలు బెణికినట్లు తెలుస్తోంది. దీంతో అతడు మైదానంలో కొంత ఇబ్బంది పడుతూ కనిపించాడు. బ్యాటింగ్ చేస్తున్న సమయంలో కూడా హార్దిక్ అసౌకర్యంగానే ఉన్నట్లు కనిపించింది. ఆ సమయంలోనే పాండ్యాకు గాయం కాకూడదని భారత అభిమానులు అందరూ దేవుడిని ప్రార్థించారు. అనుకున్నట్టుగానే పాండ్యా మైదానంలో నిలదొక్కుకోవడంతో భారత్ సెమీ ఫైనల్‌లో సంచలన విజయం పొందింది. అయితే పాండ్యాకు గాయమైందని.. ఇప్పుడు ఆ గాయం తీవ్రమైనది తెలుస్తోంది. దీంతో న్యూజిలాండ్‌తో జరిగే ఫైనల్ మ్యాచ్‌కు హార్దిక్ దూరం కావాల్సి ఉంటుంది. గతంలో హార్దిక్ చీలమండ గాయంతో బాధపడ్డాడు. ఇప్పుడు అది మళ్లీ తిరగబెడుతుందేమో అని అభిమానులు ఆందోళన చెందుతున్నారు. హార్దిక్ గాయంపై జట్టు యాజమాన్యం ఎలాంటి ప్రకటన చేయలేదు. దీంతో అతడు ఛాంపియన్స్ ట్రోఫీ తుది పోరులో ఉంటాడా లేదా అన్నది ఇప్పుడు అనుమానంగా మారింది. వరుసగా నాలుగు మ్యాచ్‌లు గెలిచిన భారత జట్టు ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌కు దూసుకెళ్లిన విషయం తెలిసిందే. ఆస్ట్రేలియాతో జరిగిన సెమీ ఫైనల్‌లో టీమిండియా విజయం సాధించడంతో ఛాంపియన్స్ ట్రోఫీ-2025లో ఫైనల్‌కు చేరుకుంది. మరోవైపు హోరాహోరీగా జరిగిన రెండో సెమీ ఫైనల్‌లో దక్షిణాఫ్రికాపై న్యూజిలాండ్ విజయం సాధించి ఫైనల్‌కు చేరుకుంది. దీంతో ఆదివారం టీమిండియాతో న్యూజిలాండ్ ఫైనల్‌లో తలపడనుంది. దుబాయ్ వేదికగా టీమిండియా, కివీస్ జట్లు పోటీ పడనున్నాయి. లీగ్ దశలో న్యూజిలాండ్‌ను ఓడించిన భారత్ ఫైనల్లోనూ అదే ఫలితాన్ని పునరావృతం చేస్తుందని భారత్ అభిమానులు భావిస్తున్నారు. లీగ్ దశలో ఎదురైన పరాభవానికి కసి తీర్చుకోవాలని న్యూజిలాండ్ ప్రణాళికలు రచిస్తోంది. మరి విజయం ఈ రెండు జట్లలో ఎవరిని వరిస్తుందో ఆదివారం వరకు వేచి చూడాల్సిందే!

## రోహిత్ ఎక్కువ సేపు బ్యాటింగ్ చేయాలి

- ఇలాంటి ఆటతీరు ప్రదర్శించడం సరికాదు
- దిగ్గజ క్రికెటర్ సునీల్ గావస్కర్



భారత వన్డే, టెస్టు కెప్టెన్ రోహిత్ శర్మ కొంతకాలంగా డిఫరెంట్ అప్రోచ్ ఫాలో అవతున్న సంగతి తెలిసింది. ప్రత్యర్థి ఎవరైనా, ఏ గేమ్ అయినా, ధాటిగా బ్యాటింగ్ చేసి జట్టుకు ఫ్లైయింగ్ స్టార్ట్ ఇస్తున్నాడు. అయితే దీని వల్ల చాలాకాలంగా తను 20-40 పరుగుల మధ్యే ఔటవుతున్నాడు. తాజాగా హెడ్ కోచ్ గౌతం గంభీర్ కూడా దీన్ని సమర్థించాడు. రోహిత్ అందించే స్టార్ట్ తమకెంతో అవసరమని వ్యాఖ్యానించాడు. తన నుంచి ఇలాంటి ఇన్నింగ్సే కోరుకుంటున్నాట్లు పేర్కొన్నాడు. అయితే తాజాగా దీనిని దిగ్గజ క్రికెటర్ సునీల్ గావస్కర్ తప్పుబట్టాడు. రోహిత్ ఇలాంటి ఆటతీరు ప్రదర్శించడం సరికాదని, తను వీలైనంత ఎక్కువ సేపు బ్యాటింగ్ చేస్తే జట్టుకే మంచిదని వ్యాఖ్యానించాడు. ఏ బ్యాటర్ కైనా, 25-30 పరుగులు చేస్తే ఆనందంగా ఉండదని, వీలైనంత ఎక్కువ సేపు బ్యాటింగ్ చేసి పరుగులు భారీగా సాధించాలని ఉంటుందని పేర్కొన్నాడు. రోహిత్ చాలా ప్రతిభావంతుడైన ప్లేయరని, అతడు ఎక్కువ సేపు క్రీజులో ఉంటే మ్యాచ్ ను ప్రత్యర్థి నుంచి దూరం చేస్తాడని గావస్కర్ గుర్తు చేశాడు. 25 ఓవర్లపాటు బ్యాటింగ్ చేస్తే ఇండియా కచ్చితంగా 180-200 పరుగులు చేస్తుందని, అప్పటికి ఒకట్రెండు వికెట్లు కోల్పోయినా, తర్వాత బ్యాటర్ల సహకారంతో ఇండియా 350 పరుగుల మార్కును ఈజీగా చేరుకోగలదని పేర్కొన్నాడు. అలా చేస్తే టీమిండియాకి తిరుగుండదని వ్యాఖ్యానించాడు. రోహిత్ దగ్గర చాలా షాట్లు ఉన్నాయని, మిగతా బ్యాటర్ల కంటే బంతిని బాగా టైమ్ చేయగల సామర్థ్యం అతని సొంతమని ప్రశంసించాడు. అలాంటి బ్యాటర్ ఎక్కువ సేపు బ్యాటింగ్ చేసేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించాడు. చాలా తక్కువ పరుగులకే ఎక్కువ సార్లు ఔటవడం రోహిత్ కు కూడా నచ్చబోదని గావస్కర్ పేర్కొన్నాడు. ఏ బ్యాటర్ అయినా సుదీర్ఘంగా బ్యాటింగ్ చేయడానికి మొగ్గు చూపుతాడని, దూకుడు కన్నా వీలైనంత ఎక్కువ సేపు బ్యాటింగ్ చేస్తేనే వన్డేల్లో భారీ స్కోర్లు సాధించవచ్చని పేర్కొన్నాడు. మరోవైప వన్డేల్లో సుదీర్ఘమైన బ్యాటింగ్ చేయగల సత్తా రోహిత్ కు ఉంది.

## డేవిడ్ మిల్లర్ అసంతృప్తి

**ఐసీసీ షెడ్యూలింగ్ ఓటమికి కారణమంటూ సంచలన వ్యాఖ్యలు**





ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ సెమీ ఫైనల్‌లో న్యూజిలాండ్‌పై ఓటమి అనంతరం ప్రోటీస్ జట్టు విధ్వంసకర ఆటగాడు డేవిడ్ మిల్లర్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. ఐసీసీ షెడ్యూలింగ్ సరిగ్గా లేదని విమర్శలు ఎక్కుపెట్టాడు. గందరగోళపు షెడ్యూలింగ్ వల్లనే తాము ఓడిపోవల్సి వచ్చిందని వివరించడం చర్చనీయాంశంగా మారింది. లాహోర్ వేదికగా మార్చ్ 5 బుధవారం జరిగిన రెండవ సెమీఫైనల్స్‌లో దక్షిణాఫ్రికా జట్టు న్యూజిలాండ్ చేతిలో ఓడిపోయింది. చోకర్స్ ముద్రను మరోసారి రుజువు చేసుకుంది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన కివీస్ నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 362 పరుగుల భారీ లక్ష్యాన్ని ప్రోటీస్ జట్టు ముందు ఉంచింది. ఆ తరువాత బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా జట్టు 9 వికెట్లు కోల్పోయి 312 పరుగులే చేయగలిగింది. ఈ మ్యాచ్‌లో డేవిడ్ మిల్లర్ ఆట విధ్వంసకరంగా మారింది. 67 బంతుల్లో సెంచరీ పూర్తి చేశాడు. టోర్నీలోనే వేగవంతమైన సెంచరీ చేసినా లాభం లేకపోయింది. సెమీస్‌కు ముందు షెడ్యూలింగ్ స్పష్టత లేకపోవడంతో దక్షిణాఫ్రికా జట్టుకు తీవ్రమైన ప్రయాణ భారం ఎదురైంది. ఎందుకంటే రెండవ సెమీఫైనల్ లాహోర్‌లో మార్చ్ 5న జరిగింది. కానీ రెండవ సెమీఫైనల్ ఎవరెవరి మధ్య అనేది కాకపోయినా ఎక్కడ అనేది అంతకు ముందు ఆదివారం జరిగిన కివీస్ వర్సెస్ ఇండియా మ్యాచ్ తరువాతే స్పష్టత వచ్చింది. ఒకవేళ ఆ మ్యాచ్‌లో కివీస్ గెలిచి ఉంటే దక్షిణాఫ్రికా సెమీఫైనల్స్ ఇండియాతో దుబాయ్‌లో ఆడాల్సి వచ్చేది.



# అంచం అప్సరసే..

## వైల్ అండ్ గోల్డ్ డ్రెస్‌లో అదరగొడుతున్న సోనమ్‌కపూర్

*ఈ మధ్య హీరోయిన్స్ సోషల్ మీడియలో చాలా యాక్టివ్‌గా ఉంటూ తమ అభిమానులతో ముచ్చటిస్తున్నారు. అంతే కాకుండా ఎప్పటికప్పుడు తన ఫ్యాన్స్ కు వరస ఫొటోషూట్స్‌తో మంచి కిక్కి ఇస్తున్నారు. ఈ క్రమలోనే బాలీవుడ్ బ్యూటీ సోనమ్ కపూర్ కూడా తన అందచందాలతో ఆకట్టుకుంటుంది. తాజాగా ఈ ముద్దుగుమ్మ వైట్ అండ్ గోల్డ్ డ్రెస్‌లో తన అందాలతో మతిపొగొడుతుంది. మరి వాటిపై ఓ లుక్ వేద్దాం పదండి! బాలీవుడ్ బ్యూటీ సీనియర్ స్టార్ హీరోయిన్, సోనమ్ కపూర్ గురించి, ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. 2007లో సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వంలో వచ్చిన సావరియా అనే సినిమా ద్వారా బాలీవుడ్ వెండితెరపైకి అడుగు పెట్టింది ఈ ముద్దుగుమ్మ. అనిల్ కపూర్ కుమార్తె అయిన ఈ బ్యూటీ అనతి కాలంలోనే వరసగా సినిమాలు చేస్తూ, స్టార్ స్టేటస్ అందుకుంది. తన నటన, అందంతో మంచి ఫ్యాన్ బేస్ సొంతం చేసుకుంది. ఇక ఎప్పుడూ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉండే ఈ బ్యూటీ, తన అందంతో కుర్రకారును మాయ చేస్తుంటుంది. వైట్ అండ్ గోల్డ్ డ్రెస్‌లో సోనమ్ కపూర్ అదిరిపోయిందంటూ తన ఫ్యాన్స్ నెట్టింట కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు.*



# కంఫర్ట్ లేదన్న ఫొటోలు తీస్తారా?

## జర్నలిస్టులపై రుక్సార్ ధిల్లాన్ ఆగ్రహం

టాలీవుడ్ యువ నటి రుక్సార్ ధిల్లాన్ గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. కన్నడ చిత్రం "రన్ ఆంటోని"తో సినీ రంగంలోకి అడుగుపెట్టిన ఈ భామ.. తెలుగులో 'ఆకతాయి' సినిమాతో ఎంట్రీ ఇచ్చింది. అయితే ఈ సినిమా బ్రేక్ ఇవ్వకపోగా.. నాని నటించిన 'కృష్ణార్జున యుద్ధం' సినిమాలో హీరోయిన్‌గా నటించి గుర్తింపు తెచ్చుకుంది. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద మంచి విజయం సాధించడమే కాకుండా, ఆమె నటనకు విమర్శకుల నుండి సానుకూల స్పందనలు లభించాయి. అనంతరం 'ఏబీసీడీ', 'అశోక వనంలో అర్జున కళ్యాణం' సినిమాల్లో నటించి ప్రేక్షకులను అలరించింది ఈ భామ. అయితే రుక్సార్ ధిల్లాన్ నటిస్తున్న తాజా చిత్రం దిల్ రూబా. రొమాంటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ సినిమాలో కిరణ్ అబ్బవరం కథానాయకుడిగా నటిస్తుండగా.. విశ్వ కరుణ్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ సినిమా ట్రైలర్ లాంచ్ వేడుకను నిర్వహించారు మేకర్స్. అయితే ఈ చెప్పినా కూడా ఫొటోలు తీస్తారా? అంటూ జర్నలిస్టలను ప్రశ్నించింది. ప్రేమతో కూడా చెప్పాను ఫొటోలు తీయవద్దు నేను కంఫర్ట్‌గా లేనని అయిన కూడా వినట్లేదు. నేను పేర్లు చెప్పలేను కానీ ఇంకోసారి ఇలా చేయకండంటూ" రుక్సార్ చెప్పుకొచ్చింది.



## రెడ్ డ్రెస్‌లో ఫొజులిచ్చిన అందాల భామ శృతిహాసన్

అందాల ముద్దుగుమ్మ స్టార్ సీనియర్ హీరో కుమార్తె శృతిహాసన్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. అనగనగా ఓ ధీరుడు సినిమాతో చిత్రపరిశ్రమలోకి అడుగు పెట్టిన ఈ ముద్దుగుమ్మ, అనతికాలంలోనే స్టార్ స్టేటస్ అందుకుంది. ఈ మూవీ తర్వాత శృతిహాసన్ చేసిన ప్రతీ సినిమా హిట్ అందుకుంది. ముఖ్యంగా పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ సరసన గబ్బర్ సింగ్ సినిమాలో నటించి ఈ బ్యూటీ మంచి ఫేమ్ సంపాదించుకుంది. ఈ సినిమా తర్వాత ఈ అమ్మడుకు అనేక అవకాశాలు వచ్చాయి. వచ్చిన ప్రతి ఆఫర్‌ను అందిపుచ్చుకొని, స్టార్ హీరోయిన్‌గా టాలీవుడ్‌నే షేక్ చేసింది ఈ బ్యూటీ. ఇక రీసెంట్‌గా ప్రభాస్ సలార్ మూవీలో నటించి పాన్ ఇండియా స్టార్ అయిపోయింది. ప్రస్తుతం ఈ అమ్మడు నాలుగు సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉంటే ఈ బ్యూటీ ఎప్పుడూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ వరస ఫొటో షూట్స్‌తో తన అభిమానుల మనసు దోచేస్తుంటుంది. తాజాగా ఈ చిన్నది రెడ్ కలర్ డ్రెస్‌లో తన అందాలతో కుర్రకారుకు విందు భోజనం పెట్టింది. ఎప్పుడూ, ఎక్కువగా బ్లాక్ డ్రెస్‌లో కనిపించే ఈ బ్యూటీ.తాజాగా రెడ్ కలర్ డ్రెస్‌లో పలు ఫొటోలకు ఫోజులిచ్చింది. అందులో శృతిహాసన్ చాలా అందంగా కనిపించింది. ప్రస్తుతం దీనికి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియలో తెగ వైరల్ అవుతున్నాయి. ఇక నటనతోనే కాకుండా శృతిహాసన్ సింగర్‌గా కూడా తన సత్తాచాటుతోంది. చాలా సినిమాల్లో ఈ బ్యూటీ పాటలు పాడి, తనకంటూ ఓ స్పెషల్ ఇమేజ్ క్రియేట్ చేసుకుంది.

EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com